విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily

ప్రశ్నించడం అందరి హక్కు...



సంపుటి : 4 | సంచిక :131 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# 1.66 లక్షల మంది అనర్హులు

- అక్టోబర్ 9న ఓటర్ల తుది జాబితా
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో అవసరమైన వివరాలు నింపలేదని ఓటర్లకు నోటీసులు జారీ
- 44,24,411 మంది విచారణను ఆదివారానికి పూర్తి చేసింది.
- తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 9న విడుదల
- 1.66 లక్షల మందిని అనర్హులుగా తేల్చిన ఈసీ



అమరావతి

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో అవసరమైన వివరాలను నింపకపోవడం, తప్పులు, అసంపూర్ణంగా సమాచారాన్ని అందించడం వంటి కారణాలతో నోటీసులు అందుకున్న 44,24,411 మంది ఓటర్లకు సంబంధించిన విచారణను భారత ఎన్నికల సంఘం ఆదివారానికి పూర్తి చేసింది.

అనర్హులుగా 1,66,279 మంది : నోటీసులు అందుకున్న 44,24,411 మంది ఓటర్లలో 1,66,279 మందిని అనర్హులుగా తేల్చింది. 42,01,092 మందిని తుది జాబితాలో కొనసాగించాలని నిర్ణయించింది. మరో 57,040 మంది విచారణ పూర్తయినప్పటికీ వారు సమర్పించిన ఆధారాల పరిశీలన కొనసాగుతోంది. 4,434 మంది విచారణ ఇంకా పెండింగ్‌లో ఉంది. అర్హులుగా 96 శాతం మంది : జులై 31న ఎన్నికల సంఘం ముసాయిదా జాబితా విడుదల చేసింది. 3,71,38,182 మంది ఓటర్ల వివరాలను అందులో ప్రచురించింది. ఎన్యూమరేషన్ పత్రాల్లో వివరాలు సరిగ్గా నింపలేదనే కారణంతో 44,28,845 మందికి నోటీసులిచ్చింది. దాదాపు విచారణ పూర్తి చేసి 96 శాతం మందిని

వివరాలు 2లో..

## 'సర్' వివాదం
## సీఈసీ రాజీనామాకు ఖర్గే డిమాండ్.. ప్రతిపక్షంపై నడ్డా ఫైర్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు
- ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల విమర్శలు
- ఖర్గే వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా





## నేపాల్‌లో జలవిలయం..

- 6 సెకన్లలో కళ్లముందే కుప్పకూలి నదిలో కలిసిపోయిన భారీ కొండ
- ఈ ఘోర విపత్తుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి
- వరదలు, కొండచరియల వల్ల 24 మంది మృతి, పలువురు గల్లంతు
- హిమపాతంలో చిక్కుకుని మరో ఇద్దరు మృతి, 10 మంది గల్లంతు

## తుఫాన్ నష్టం

- 44,029 హెక్టార్లలో వ్యవసాయ పంటలు
- 1,734 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం
- ఎన్యుమరేషన్‌లో వేగం పెంచాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు




అమరావతి

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టానికి సంబంధించిన ఎన్యుమరేషన్ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టంపై అందిన ప్రాథమిక నివేదికలు, ఇప్పటివరకు జరిగిన ఎన్యుమరేషన్ పురోగతిని మంత్రి సమీక్షించారు. తుఫాన్ ప్రభావంతో వివిధ జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వాస్తవ నష్టాన్ని పక్కాగా గుర్తించడం అత్యంత ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. బాధిత రైతుల వివరాల నమోదులో ఎలాంటి లోపాలకు తావులేకుండా,

వివరాలు 2లో..

## భారత్‌తో మాది మంచి భాగస్వామ్యం

- కానీ ఉపయోగించుకోలేకపోయాం: ఆస్ట్రేలియా ప్రధాని
- భారత్, ఆస్ట్రేలియా భాగస్వామ్యం మరింత పెరగాల్సి ఉందన్న అల్బనీస్
- ప్రధాని మోదీతో కలిసి సంబంధాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్న ఆస్ట్రేలియా ప్రధాని
- డిసెంబరులో భారత్‌కు వ్యాపార ప్రతినిధి బృందంతో పర్యటన



## తెలంగాణ సీజేకు ప్రమోషన్

- ముగ్గురు జడ్జిలను సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- మూడు రాష్ట్రాల హైకోర్టు సీజేలను సుప్రీంకోర్టు జడ్జిలుగా పదోన్నతికి సిఫారసు
- తెలంగాణ, గుజరాత్, ఢిల్లీ హైకోర్టు సీజేల పదోన్నతికి సిఫారసు
- నేటి సమావేశంలో సిఫారసుకు ఆమోదం తెలిపిన కొలీజియం




## రిజర్వాయర్ల నిర్వహణకు రూ.160 కోట్లు విడుదల





- మంత్రి నిమ్మల రామానాయుడు
- గత ప్రభుత్వం రద్దు చేసిన సాగునీటి సంఘాల వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ధరించి రైతులకు కొండంత భరోసా కల్పించారు
- ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న పరిమిత జల వనరులను సమర్థవంతంగా వినియోగించడంలో సాగునీటి సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి

అమరావతి

కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులకు సంబంధించి రూ.160 కోట్ల బిల్లులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురై, దెబ్బతిన్న సాగునీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి గాడిలో పెడుతోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రద్దు చేసిన సాగునీటి సంఘాల వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ధరించి రైతులకు కొండంత భరోసా కల్పించారని

వివరాలు 2లో..



## హర్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను తరిమికొట్టాం

- హెజ్‌బొల్లా మాజీ నాయకుడు హసన్ నస్రల్లా వర్ధంతి సందర్భంగా మొజ్తబా ఖమేనీ ఇరాన్ పౌరులను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశం
- అమెరికా మళ్లీ దాడులకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ విదేశాంగమంత్రి వార్నింగ్
- త్వరలోనే శత్రువులను అరేబియా సముద్రం నుంచి కూడా తరిమికొడతాం
- హర్మూజ్ జలసంధిలో శత్రుదేశాలు స్వేచ్ఛగా సంచరించకుండా తమ దళాలు అడ్డుకున్నాయి

## జలవనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు
# ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

- జలవనరులు కలుషితం కాకుండా చూడాలని ఆదేశం
- ఆక్వా వ్యర్థాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమీక్ష
- ఆక్వా వ్యర్థాల నుంచి వచ్చే అనర్థాల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు
- ప్రాసెసింగ్ యూనిట్లలో పర్యావరణ ప్రమాణాల అమలుకు ప్రత్యేక పర్యవేక్షణ
- పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, భూగర్భ జలాలు కాలుష్యం బారినపడుతున్నాయి



అమరావతి

ఆక్వా వ్యర్థాల కారణంగా జలవనరులు కలుషితం కాకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్? ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా ప్రాసెసింగ్, ఆక్వా ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు నిర్దేశిత పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు. ఆక్వా కాలుష్యంపై ఇవాళ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. శుద్ధి చేయని ఆక్వా వ్యర్థాల్లో పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, భూగర్భ జలాలు కాలుష్యం

వివరాలు 2లో..

# 1.66 లక్షల మంది అనర్హులు

-మొదటిపేజీ తరువాయి

అర్హులుగా తేల్చింది.

మిగతా 3,27,09,337 ఓటర్లలో 3,27,08,479 మందిని తుది జాబితాలో కొనసాగించేందుకు అర్హులుగా గుర్తించింది. మరో 858 మందికి సంబంధించిన విచారణ పెండింగ్‌లో ఉంది. ఓటు హక్కు నమోదుకు కొత్తగా వచ్చిన ఫాం-6లలో 85,736, చిరునామాలు, పేర్లు, ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులకు వచ్చిన ఫాం-8లలో 40,991, అనర్హుల ఓట్లు తొలగించాలంటూ వచ్చిన ఫాం-7లలో 9,296 దరఖాస్తుల విచారణ పెండింగ్‌లో ఉంది.


పెండింగ్ దరఖాస్తుల విచారణను అక్టోబరు 5కల్లా పూర్తిచేసి 9న తుది జాబితా ప్రచురించనుంది.

**అత్యధికంగా అనంతపురం జిల్లాలో**

నోటీసులందుకున్న ఓటర్లలో అత్యధికంగా అనంతపురం జిల్లాలో 22,943 మంది, తిరుపతి జిల్లాలో 19,596 మంది, పల్నాడులో 18,843 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 12,509, అన్నమయ్యలో 12,098 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 11,227 మందిని అనర్హులుగా తేల్చారు.

**గుర్తించిన లోపాలు**

ఎన్యూమరేషన్ పత్రాల పరిశీలనలో తల్లిదండ్రులు -- పిల్లల మధ్య వయస్సు తేడా 15 ఏళ్ల కంటే తక్కువగా, 50 ఏళ్ల కంటే ఎక్కువగా నమోదు కావడం, ఓటరు--తాత లేదా నాన్నమ్మ మధ్య వయస్సు తేడా 40 ఏళ్ల కంటే తక్కువగా



ఉండటం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. అలాగే ప్రస్తుత జాబితా, 2002 జాబితాలో తండ్రి పేరులో తేడాలు ఉండటం, ఒకే తల్లిదండ్రులకు చెందిన పిల్లల మధ్య వయస్సు తేడా 9 నెలల కంటే తక్కువగా నమోదు కావడం, ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల వివరాల్లో తప్పులు వంటి లోపాలు కూడా వెలుగుచూశాయి.

# విజయవాడ ఉత్సవం-2.0ను విజయవంతం చేద్దాం

కేశినేని శివనా థ్

**విజయవాడ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని దేశానికి చాటడమే లక్ష్యం -మంత్రి సత్య కుమార్ యాదవ్**

**విజయవాడ :** విజయవాడ నగర సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చారిత్రక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పడంతో పాటు పర్యాటక రంగం, స్థానిక వ్యాపారాలకు కొత్త అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటకశాఖ, సహకారం తో సొసైటీ ఫర్ వైబ్రేశీట్ విజయవాడ వారు నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవం--2.0కు కర్టెన్ రైజర్ కార్యక్రమం ఘనంగా జరిగింది.గత ఏడాది ప్రజల భాగస్వామ్యంతో విజయవాడ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో, ఈ ఏడాది మరింత వైభవంగా విజయవాడ ఉత్సవం--2.0 నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఎంపీ,కేశినేని చిన్ని తెలిపారు. విజయవాడ ఉత్సవం నిర్వహణకు తాను చేసిన ఆలోచనకు ప్రభుత్వం, మంత్రులు, ప్రజలు, వివిధ వర్గాల నుంచి లభిస్తున్న సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం ఒక సాంస్కృతిక కార్యక్రమం కాదని, విజయవాడ నగర బ్రాండ్‌ను మరింతగా పెంచడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, స్థానిక ఉపాధి అవకాశాలకు వేదికగా నిలవాలన్నదే ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.దసరా సందర్భంగా విజయవాడకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో, నగర ప్రజలు వారికి ఆతిథ్య భావంతో స్వాగతం పలకాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు. ప్రతి ఇల్లు, ప్రతి వ్యాపార సంస్థ దసరా, విజయవాడ ఉత్స వాల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించుకుని నగరాన్ని పండుగ వాతావరణంలోకి తీసుకురావాలని కోరారు. విజయవాడ ఉత్సవానికి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల ద్వారా స్థానిక వ్యాపారులు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, కళాకారులు తదితర వర్గాలకు ఆదాయ, ఉపాధి అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు.

**650 స్టాళ్లతో నేషనల్ సరస్ మేళా**

విజయవాడ పున్నమి ఘాట్‌లో తొలిసారిగా నేషనల్ సరస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీ చిన్ని తెలిపారు. దేశవ్యాప్తంగా డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల మహిళలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించి మార్కెటింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. మొత్తం 650 స్టాళ్లు ఏర్పాటు




చేస్తుండగా, వాటిలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘాలకు 230 స్టాళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో విజయవాడ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, మంత్రి కందుల దుర్గేష్, ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అందిస్తున్న సహకారానికి ఎంపీ చిన్ని కృతజ్ఞతలు తెలిపారు.

**విజయవాడ వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాం: మంత్రి సత్యకుమార్ యాదవ్**

విజయవాడకు చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడ ఉత్సవాల ద్వారా నగర ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటుతున్నామని తెలిపారు.విజయవాడ ఉత్సవాల ఆలోచన చేసి, ప్రజల భాగస్వామ్యంతో వాటిని నిర్వహించేందుకు చొరవ తీసుకున్న ఎంపీ కేశినేని చిన్ని అభినందనీయుడని అన్నారు. ఉత్సవాల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు.దసరా సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విజయవాడ ఉత్సవాలు కేవలం సాంస్కృతిక కార్యక్రమం కాదని, పర్యాటక అభివృద్ధి, స్థానిక ఉపాధి, వ్యాపార అవకాశాల పెంపునకు వేదికగా నిలుస్తాయని చెప్పారు. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం కుటుంబాలను బలోపేతం చేస్తుందని, మహిళా సంక్షేమ కార్యక్రమాలు కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తున్నాయని మంత్రి తెలిపారు. విజయవాడ ఉత్సవాల స్ఫూర్తితో ధర్మవరంలో సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్ సత్య కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా,వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ కార్పొరేషన్ చైర్మన్లు పట్టాభివివిధ హోదాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# జాతీయ రాజకీయాల్లో జగన్ దారెటు

**హైదరాబాద్ :** కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం, సవరణ చట్టంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోషల్ మీడియాలో చేసిన ప్రకటన జాతీయ స్థాయిలో పెద్ద దుమారాన్నే రేపింది. పరీక్ష రాసే విద్యార్థే ఎగ్జామినర్‌ను నియమించుకున్నట్లుగా ప్రభుత్వమే సీఈసీని ఎంచుకోవడం ఏంటి " అని జగన్ లేవనెత్తిన ప్రశ్న సహేతుకమైనదే అయినప్పటికీ, దానికి ఆయన ఎంచుకున్న సమయం, గతంలో ఆయన పార్టీ తీసుకున్న పార్లమెంటరీ నిర్ణయాలు ఆయన రాజకీయ విధానాలను ప్రశ్నించేలా చేస్తున్నాయి. నిన్నటివరకు కేంద్ర చట్టాలకు సభలో మద్దతు పలికి, ఇప్పుడు విమర్శలకు దిగడంపై జాతీయ విపక్షాలు జగన్ మోహన్ రెడ్డిని ద్వంద్వ నీతి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలకు కారణం అవుతున్నాయి. ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రా సోషల్ మీడియా వేదికగా జగన్‌కు నేరుగానే ఘాటు కౌంటర్ ఇచ్చారు. వ్యవస్థలను ధ్వంసం చేసే వారికి ముందు పార్లమెంట్‌లో మద్దతు ఇవ్వడం ఆపండి.. ఆ తర్వాత గ్యాలరీ సమాధానాల కోసం మాట్లాడండి అంటూ ఆమె నేరుగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి ని తప్పిస్తూ కేంద్రం తీసుకువచ్చిన బిల్లుకు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతు పలికిన విషయాన్ని, కనీసం వాకౌట్ కూడా చేయకపోవడాన్ని ఈ సందర్భంగా జాతీయ నేతలు గుర్తు చేస్తున్నారు.వైఎస్ జగన్ రాజకీయ విధానంలో అనుసరిస్తున్న అంశాల వారీ మద్దతు వ్యూహమే ఆయనను డిఫెన్స్‌లో పడేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.



అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలోని బీజేపీకి దాదాపు ప్రతి కీలక బిల్లు ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్, ఢిల్లీ సర్వీసెస్ బిల్లు, ఈసీ నియామక బిల్లు ముందస్తుగా మద్దతు పలికి, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక అవే నిర్ణయాలను తప్పుపట్టడం వల్ల ఆయన రాజకీయ విశ్వసనీయత దెబ్బతింటోంది. జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి బీజేపీ విధానాలను మొదటి నుంచీ సైద్ధాంతికంగా వ్యతిరేకిస్తుంటే, జగన్ మాత్రం సొంత రాష్ట్రాభివృద్ధి లేదా ఇతర సమీకరణాల పేరుతో కేంద్రానికి సహకరించారు. అయితే ఇప్పుడు ఏపీలో అధికారం కోల్పోయిన తర్వాత, ఎన్నికల కమిషన్ తీరుపై సొంతంగా అనుమానాలు వచ్చినప్పుడు మాత్రమే గళం విప్పడం వల్ల, జాతీయ విపక్షాలు ఆయనను సులభమైన రాజకీయ అవకాశవాది గా చూసే పరిస్థితి ఏర్పడింది. ఒక నిర్దిష్టమైన సిద్ధాంతం లేదా పొలిటికల్ ఐడియాలజీ లేకపోవడం వల్లనే ఆయన తీరుపై ఇలాంటి విమర్శలు వస్తున్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ స్థాయిలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ వంటివి జగన్ వైఖరిని ఎండగడుతున్నాయి. ముందు పాలసీ ప్రకారం రాజకీయాలు చేయండి.. బీజేపీ తెచ్చే ప్రజాస్వామ్య వ్యతిరేక బిల్లులను పార్లమెంట్‌లో ఓడించకుండా మద్దతు ఇచ్చి, తీరా నష్టం జరిగిన తర్వాత రోడ్డెక్కి మాట్లాడటం వల్ల ఉపయోగం లేదు అని ఆయా పార్టీలు హెచ్చరిస్తున్నాయి. కేంద్రంతో వైఎస్సార్‌సీపీకి ఉన్న లోపాయికారీ అవగాహన వల్లే వారు ఇలా సగం దూరంలో ఆగిపోతున్నారనే ప్రచారం వ్యాపిస్తోంది. ఈ పరిణామాలు జగన్ మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు , జాతీయ ఇమేజ్‌కు పెద్ద పరీక్షగా మారాయి. మారుతున్న రాజకీయాల్లో మధ్యస్థ వైఖరి, అవకాశవాద మద్దతు పనిచేయదని, ఏదో ఒక వైపు స్పష్టమైన స్టాండ్ తీసుకోవాల్సిందేనని ఈ వివాదం స్పష్టం చేస్తోంది. మరి ఇప్పటికైనా జగన్ తన జాతీయ రాజకీయ విధానంపై స్పష్టత తెచ్చుకుంటారో లేదా ఇలాగే డబుల్ గేమ్ విమర్శలను ఎదుర్కొంటూ సాగుతారో వేచి చూడాలి.

## తుఫాన్ నష్టం..

-మొదటిపేజీ తరువాయి

ప్రతి రైతు పంట నష్టాన్ని సమగ్రంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 89 మండలాలు, 351 గ్రామాల్లో ఉద్యానవన పంటలు ప్రభావితమయ్యాయి. మొత్తం 1,734 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతినగా, 5,777 మంది రైతులు పంట నష్టానికి గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటివరకు 445 హెక్టార్లకు సంబంధించి 950 మంది రైతుల పంట నష్టం ఎన్యుమరేషన్‌ను పూర్తి చేశారు. ఇంకా 1,289 హెక్టార్లకు సంబంధించిన పంట నష్టం వివరాలను నమోదు చేయాల్సి ఉందని అధికారులు మంత్రికి వివరించారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం 190 మండలాల్లోని 1,229 గ్రామాలు తుఫాన్ ప్రభావానికి గురయ్యాయి. మొత్తం 71,796 మంది రైతులకు పంట నష్టం జరిగినట్లు గుర్తించగా, సుమారు 44,029 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటివరకు 19 మండలాల్లోని 45 గ్రామాలకు చెందిన 726 మంది రైతుల పంట నష్టానికి సంబంధించిన ఎన్యుమరేషన్‌ను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుత ఎన్యుమరేషన్ పురోగతిని సమీక్షించిన మంత్రి అచ్చెన్నాయుడు, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల జాయింట్ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు సహా క్షేత్రస్థాయి సిబ్బంది పంట నష్టాల ఎన్యుమరేషన్‌ను అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమంగా తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, ఏ ఒక్క బాధిత రైతు వివరాలు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని మంత్రి స్పష్టం చేశారు. పంట నష్టం వివరాల నమోదులో పారదర్శకత, కచ్చితత్వం పాటించాలని, వాస్తవంగా నష్టపోయిన ప్రతి రైతు వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, జిల్లాల వారీగా, పంటల వారీగా సమగ్ర నష్టం వివరాలను ప్రభుత్వానికి అందించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## రిజర్వాయర్ల నిర్వహణకు రూ.160 కోట్లు విడుదల

-మొదటిపేజీ తరువాయి

మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న పరిమిత జల వనరులను సమర్థవంతంగా వినియోగించడంలో సాగునీటి సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. రైతుల భాగస్వామ్యంతోనే సాగునీటి నిర్వహణ మరింత సమర్థవంతంగా జరుగుతుందనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఓఅండ్ఎం పనులకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. దీనివల్ల సాగునీటి వ్యవస్థ నిర్వహణ తీవ్రంగా దెబ్బతిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే ఓఅండ్ఎం పనుల కోసం రూ.1,320 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. కాలువల్లో పూడికతీత, లాకులు, షట్టర్లు, రోప్‌ల మరమ్మతులు వంటి అత్యవసర పనులకు గత ప్రభుత్వంలో నిధులు కేటాయించలేదని మంత్రి విమర్శించారు. చివరకు సాగునీటి వ్యవస్థలో అవసరమైన గ్రీజు పెట్టడం వంటి చిన్నపాటి నిర్వహణ పనులకు కూడా నిధులు అందని పరిస్థితి నెలకొందని తెలిపారు. కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల నిర్వహణకు అవసరమైన నిధులను అందుబాటులో ఉంచుతూ, సాగునీటి వ్యవస్థను నిరంతరం సమర్థవంతంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రైతుల ప్రయోజనాలు, సాగునీటి భద్రతే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## జలవనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత



-మొదటిపేజీ తరువాయి

బారినపడుతున్నాయని పవన్ కల్యాణ్ చెప్పారు. ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బ తింటున్నాయని వివరించారు. జలవనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వెలువడుతున్న కాలుష్య ప్రభావం, నివారణ చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 119 ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, 12 ఆక్వా ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని పీసీబీ అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అక్కడ చేసే తనిఖీలు, నమూనాల సేకరణ, పరీక్షల నిర్వహణకు సంబంధించిన విషయాలను తెలియజేశారు. ఈ క్రమంలో స్పందించిన ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లలో క్రమం తప్పకుండా నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని అధికారులు సూచించారు. తద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి నివారించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఉల్లంఘనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా యూనిట్లు పర్యావరణ ప్రమాణాలు సమర్థవంతంగా పాటించేలా చేయడమే లక్ష్యమని పవన్ స్పష్టం చేశారు. పరవాడ కాలుష్యంపై పవన్ స్పందన : మరోవైపు అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లు, వర్షపు నీటి కాలువల్లో నల్లటి రంగుతో కూడిన నీరు ప్రవహిస్తోందని దీంతో దుర్వాసన వస్తోందని శుక్రవారం నాడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరు వీడియో పోస్ట్ చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్? స్పందించారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో పర్యటించి వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. వీడియో ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో తనిఖీలు చేపట్టారు. శుద్ధి చేయని వ్యర్థాలతో కూడిన నీటిని ఇందులోకి విడుదల చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు దీనిపై వివరణ కోరుతూ 95 కంపెనీలకు షోకాజ్? నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మురుగునీరు లేదా కలుషిత నీటిని బయటకు విడుదల చేయరాదని చెప్పారు. ఎఫ్లుయెంట్, ప్రమాదకర వ్యర్థాలను క్రమం తప్పకుండా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని అధికారులు తెలిపారు. శుద్ధి చేసిన వ్యర్థాలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని కనీసం ఆరు నెలల పాటు భద్రపరచాలన్నారు. కన్‌సెంట్ టు ఆపరేట్ , హాజర్డస్ వేస్ట్ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. అక్రమంగా మురుగునీరు, ప్రమాదకర వ్యర్థాలు, ఉప ఉత్పత్తుల వంటి వాటిని విడుదల చేస్తున్నట్లు నిర్ధారణయితే ఆయా పరిశ్రమలపై పర్యావరణ నిబంధనలను అనుసరించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న పరిశ్రమలను ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే షోకాజ్ నోటీసులపై స్పందించేందుకు పరిశ్రమలకు ఏడు రోజుల సమయమిచ్చారు. నిర్దేశిత సమయంలో సంతృప్తికరమైన వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ మేరకు తీసుకున్న చర్యలను వివరిస్తూ ఒక నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. మరోవైపు అధికారుల చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# నిరక్షరాస్యతను నిర్మూలించి, అందరినీ అక్షరాస్తులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.

**వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి.**

**జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.**



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబరు 28:** జిల్లాలో అమలు చేస్తున్న 'ఉల్లాస్ అక్షరాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మూడో విడతకు సంబంధించిన అధ్యయన సామగ్రి, పుస్తకాలను సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్షర ఆంధ్ర (ఉల్లాస్) కార్యక్రమంలో భాగంగా 3 వ దశకు గాను అభ్యాసకులకు 1,50,109 బుక్స్ జిల్లాకు చేరినట్లు తెలిపారు. ఈ దశలో 1,01,653 మంది లెర్నర్స్ అక్షర ఆంధ్ర యాప్ లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎన్‌రోల్ అయిన వయోజనులందరినీ (లర్నర్స్) అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావాలని కోరారు. వీరికి పట్టణ, గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాలు, అంగన్వాడీ కేంద్రాల్లో గుర్తించిన వాలంటీర్ టీచర్స్ తో 100 రోజుల పాటు, చదవడం, రాయడం, గణిత అంశాల పై, ఫంక్షనల్ లిటరసీ, ఫైనాన్సియల్ లిటరసీ పై ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు, బోధన చేయించి, సాధన చేయించి వారిని అక్షరాస్యులు గా తయారయ్యేటట్లు ప్రతి ఎంపీడీఓ, ఏపీఎం, ఏపీవో మండల స్థాయిలో కృషి చేయాలన్నారు. అదే విధంగా మున్సిపల్ కమిషనర్లు, అనకాపల్లి జోనల్ కమిషనర్ స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఉత్తమ ఫలితాలు సాధించాలని, వయోజన విద్యా అసిస్టెంట్ డైరెక్టర్ జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేసి శతశాతం అక్షరాస్యతకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించిన గంటా...







కొమ్మాది, పెన్ సత్తా, సెప్టెంబర్ 28: కొమ్మాది టిడ్కో గృహ సముదాయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. ఈ ఇళ్లలో దిగే వారికి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. డ్రెయిన్లు, విద్యుత్ మీటర్లు వంటి సదుపాయాలను పరిశీలించారు. అర్హులైన అందరికీ ఆవాసాలు కల్పించాలనే ప్రభుత్వ ఆశయంలో భాగంగా నగర పరిసరాల్లో ఉంటున్న వారికి స్థానికంగానే టిడ్కో ఇళ్లు కేటాయిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సివిల్ సహా విద్యుత్, ప్లంబింగ్, పెయింటింగ్ పనులు పూర్తయ్యాయన్నారు. అమరావతి నగర్ వద్ద బురదమయంగా ఉన్న రోడ్డు రాకపోకలకు వీలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఏపీడీ శ్రీరాం, నాయకులు నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, కానూరు అచ్యుతరావు, గరే గుర్నాథ్, బోయి శ్రీను, పోతిన శివ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో అత్యాధునిక వైద్య సేవలకు మరో ముందడుగు.

**అపోలో అధునాతన కమాండ్ సెంటర్‌ను ప్రారంభించిన పల్లా.**

**విశాఖను ఆరోగ్య హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఆధునిక వైద్య సదుపాయాలు కీలకం.**



**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబరు 28:** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా విశాఖ లోని అపోలో హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన అధునాతన కమాండ్ సెంటర్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. సాంకేతికత ఆధారిత కనెక్టెడ్ కేర్ విధానంతో నిపుణుల వైద్య సేవలను మరింత వేగంగా, చేరువగా అందించేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విశాఖ ఇప్పటికే రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా, ఆరోగ్యం, ఐటీ, పరిశ్రమలు, పెట్టుబడులకు కీలక కేంద్రంగా ఎదుగుతోందని పల్లా పేర్కొన్నారు. నగరంలో ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటు లోకి రావడం విశాఖ ప్రాధాన్యాన్ని మరింత పెంచుతుందన్నారు. చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం విశాఖ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, మౌలిక వసతులతో పాటు వైద్య రంగంలోనూ ఆధునిక సదుపాయాలకు ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. స్మార్ట్ అంబులెన్స్, టెలి-ఈసీజీ, టెలిమెడిసిన్ వంటి సేవలను అనుసంధానించడం ద్వారా అత్యవసర సమయాల్లో రోగులకు వేగంగా నిపుణుల వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పల్లా అన్నారు. ప్రత్యేక వైద్య చికిత్సల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గేలా విశాఖ లోనే అధునాతన వైద్య సేవలు అందుబాటు లోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు

# గ్రామీణాభివృద్ధి పనుల పై ప్రత్యేక దృష్టి సారించాలి కలెక్టర్

**మండలాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి.**





**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబరు 28:** జిల్లాలో అన్ని మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేలా సమన్వయంతో అధికారులు పనిచేయాలని, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ నుంచి మండల అభివృద్ధి అధికారులు, ఉప మండల అభివృద్ధి అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ, అగ్రికల్చర్, విద్యుత్ శాఖ, డి ఆర్ డి ఎ, డిపిఓ, ఇరిగేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాల నిర్వహణ, గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాల పై జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మండల అధికారులు (మంగళవారం) పి.జి.ఆర్.ఎస్ (పిజిఆర్ఎస్) వినతుల పరిష్కారానికి క్షేత్రస్థాయి సందర్శన చేయాలన్నారు. అధికారులందరూ తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి. వ్యవసాయ రంగానికి సంబంధించి ఏఓ, నీటిపారుదల రంగానికి ఏఈ, పారిశుధ్యానికి డెప్యూటీ ఎంపీడీఓ, తాగునీటి విభాగానికి ఏఈ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ రోజు(సోమవారం) పి జి ఆర్ ఎస్ లో వచ్చిన 280 వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్యాడీ (వరి) పంటలను ఇన్సూరెన్స్ పరిధి లోకి తేవడం జరుగుతుందని, ఇన్సూరెన్స్ పరిధి లోకి రాని పంటలకు పిఎండిఎస్ విధానం ద్వారా సహజ వ్యవసాయ నిపుణుల సాయంతో రక్షణ కల్పించాలని అన్నారు. రాబోయే 5 రోజుల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఊరి లోని చెరువుల్లో నిమజ్జనం చేసిన విగ్రహాల వ్యర్థాలు, దుమ్ము-ధూళిని తొలగించి, చెరువులను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి కోసం ప్రతి ఊరు, మండలం, నియోజకవర్గంలో రూ. 200 కోట్లకు సంబంధించిన అభివృద్ధి పనులను స్పష్టంగా హైలైట్ చేయాలని తెలిపారు. ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమం చూసుకోవాలన్నారు. ప్రతి నెలా మొదటి తేదీని "సంక్షేమ దినోత్సవం గా పరిగణించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు, ఉదయం వేళల్లో పింఛన్ల పంపిణీ పూర్తి చేసి, మధ్యాహ్నం క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు సందర్శించాలని, ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, పి.జి.ఆర్.ఎస్ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు పై ప్రజలతో చర్చించాలన్నారు. అధికారులు స్వయంగా పర్యవేక్షించి, సమస్యలు వింటున్నారనే నమ్మకాన్ని ప్రజల్లో పెంపొందించాలని సూచించారు. రోడ్డు భద్రత చర్యలు సహా పలు కీలక అంశాల పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా పనులను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్ల కూడళ్ల వద్ద, మలుపుల వద్ద వైర్‌లెస్ లైట్ల ఏర్పాటుకు సంబంధించి ఈఈ, పిఆర్ అధికారులతో అంచనాలు సిద్ధం చేయాలన్నారు. మండల పరిషత్ నిధుల ద్వారా అవసరమైన చోట్ల సైన్‌బోర్డులు, జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లను వెంటనే ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ లను ఆదేశించారు. పాఠశాల భవనాల కూల్చివేత, బిల్లుల చెల్లింపు వంటి పలు అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదకరంగా మారిన పాత, శిథిల మైన పాఠశాల భవనాల కూల్చివేత ప్రక్రియను బుధవారం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో గత బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తయిందని, గత రెండు నెలల కాలంలో రూ. 67 కోట్ల నిధులు విడుదలయ్యాయని వెల్లడించారు. జల జీవన్ మిషన్ పథకం అమలు, పనుల పురోగతి పై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. జిల్లా లోని ప్రతీ కాంట్రాక్టర్‌కు జల జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ. 67 కోట్ల విలువైన బిల్లులను చెల్లించడం జరిగిందని స్పష్టం చేశారు. ప్రతీ మండలంలో ఎంపీడీవోలు కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేయకపోతే కాంట్రాక్ట్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి డిపిఓ, డ్వామా పిడి, ఆర్ డబ్ల్యు ఎస్., ఎస్ఈ, డిఆర్డిఏ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గుంటూరు ఛానల్ భూసేకరణ పరిహారం పూర్తిగా చెల్లింపు

**5 విడతల్లో మొత్తం రూ.70.17 కోట్లు విడుదల.**

**7 గ్రామాలకు చెందిన 322 మంది రైతులకు పూర్తి పరిహారం చెల్లింపు.**

**ఐదు విడతల్లో మొత్తం 19 సీఎఫ్ఎంఎస్ బిల్లులు క్లియర్**



**గుంటూరు, పెన్ సత్తా, సెప్టెంబర్ 28:** గుంటూరు ఛానల్ ఎక్స్‌టెన్షన్ భూ సేకరణకు సంబంధించి భూములు ఇచ్చిన రైతులకు చెల్లించాల్సిన మొత్తం రూ.70.17 కోట్ల పరిహారం పూర్తిగా విడుదలైందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ఓ ప్రకటన ద్వారా సోమవారం తెలిపారు.

గారపాడు, కొండేపాడు, ఎనమదల, ప్రత్తిపాడు, మల్లాయపాలెం, రావిపాడు, జీజీ పాలెం గ్రామాలకు చెందిన 322 మంది రైతులకు పరిహారం అందేలా చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. ఈ సందర్భంగా డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గుంటూరు ఛానల్ భూ సేకరణ పరిహారానికి సంబంధించి మొత్తం రూ.70,17,46,929 విలువైన 19 సీఎఫ్ఎంఎస్ బిల్లులు ఐదు విడతల్లో క్లియర్ అయ్యాయని తెలిపారు. మార్చి 5, మే 30, జూలై 27, ఆగస్టు 28, సెప్టెంబర్ 28 తేదీల్లో బిల్లులు క్లియర్ అయినట్లు పేర్కొన్నారు. భూములు ఇచ్చిన 322 మంది రైతులకు రావాల్సిన పరిహారం మొత్తం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. రైతుల సహకారంతో గుంటూరు ఛానల్ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని, భూములు ఇచ్చిన ప్రతి రైతుకు రావాల్సిన పరిహారం అందేలా చర్యలు తీసుకున్నామని డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కి అలాగే సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్కూల్ దశ నుంచే ఆరోగ్యపు అలవాట్లు అలవర్చుకోవాలి గంటా



**ఆనందపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 28:** చిన్న వయసు నుంచే శుభ్రత ప్రాధాన్యాన్ని అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని సాధించవచ్చని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక హైస్కూల్ లో నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలకు కూటమి ప్రభుత్వం రూ.50 వేల కోట్ల కేటాయింపులు చేసిందన్నారు. చదువుకునే పిల్లలు ఆరోగ్యంగా ఉంటే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తారని, కడుపులో నులి పురుగుల వల్ల రక్తహీనతతో త్వరగా అలసిపోతారని తెలిపారు. ఏటా రెండు సార్లు మాత్రలు తీసుకుంటే నులి పురుగుల సమస్య ఉత్పన్నం కాదని పేర్కొన్నారు. ఆరోగ్యపు అలవాట్ల గురించి టీచర్లు విద్యార్థులకు చెప్పాలని సూచించారు. అధికారం చేపట్టగానే డీఎస్సీ ఫైలు మీద తొలి సంతకం చేసి 17 వేల టీచర్లను రిక్రూట్మెంట్ చేసి నాణ్యమైన విద్యా బోధనకు బాటలు వేశామని పేర్కొన్నారు. గురువులతో మద్యం అమ్మించిన చరిత్ర వైసీపీదని విమర్శించారు. నులి పురుగుల నివారణ ఆవశ్యకత గురించి గంటా ప్రశ్నించగా ఇద్దరు పదో క్లాస్ విద్యార్థులు వివరించారు.

**మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసిన గంటా.**

అనంతరం హైస్కూల్ లో మధ్యాహ్న భోజనాన్ని గంటా శ్రీనివాసరావు రుచి చూశారు. భోజనంలో ఏయే పదార్థాలు పెడుతున్నారో క్లాస్ రూంలో విద్యార్థులను ఆరాతీశారు. గుడ్లు, చిక్కీ, అంబలి ఇస్తున్నారని, అడిగినంతా వడ్డిస్తున్నారని విద్యార్థులు చెప్పారు. ఈ సందర్భంగా చిక్కీ నాణ్యత ఎమ్మెల్యే పరిశీలించారు. ఆడుకోవడానికి గ్రౌండ్ లేదని చెప్పడంతో దగ్గర్లో ప్రభుత్వ స్థలాన్ని చూడాలని ఆదేశించారు.



# విశాఖలో అత్యాధునిక వైద్య సేవలకు మరో ముందడుగు.

**అపోలో అధునాతన కమాండ్ సెంటర్‌ను ప్రారంభించిన పల్లా.**

**విశాఖను ఆరోగ్య హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఆధునిక వైద్య సదుపాయాలు కీలకం.**

**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబరు 28:** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా విశాఖ లోని అపోలో హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన అధునాతన కమాండ్ సెంటర్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. సాంకేతికత ఆధారిత కనెక్టెడ్ కేర్ విధానంతో నిపుణుల వైద్య సేవలను మరింత వేగంగా, చేరువగా అందించేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విశాఖ ఇప్పటికే రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా, ఆరోగ్యం, ఐటీ, పరిశ్రమలు, పెట్టుబడులకు కీలక కేంద్రంగా ఎదుగుతోందని పల్లా పేర్కొన్నారు. నగరంలో ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటు లోకి రావడం విశాఖ ప్రాధాన్యాన్ని మరింత పెంచుతుందన్నారు. చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం విశాఖ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, మౌలిక వసతులతో పాటు వైద్య రంగంలోనూ ఆధునిక సదుపాయాలకు ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. స్మార్ట్ అంబులెన్స్, టెలి-ఈసీజీ, టెలిమెడిసిన్ వంటి సేవలను అనుసంధానించడం ద్వారా అత్యవసర సమయాల్లో రోగులకు వేగంగా నిపుణుల వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పల్లా అన్నారు. ప్రత్యేక వైద్య చికిత్సల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గేలా విశాఖ లోనే అధునాతన వైద్య సేవలు అందుబాటు లోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు







# 316 కుటుంబాలకు ఈ నెల 30 న ఇళ్ల పట్టాల పంపిణీ ఎమ్మెల్యే యార్లగడ్డ






**సీఎం చంద్రబాబు చేతుల మీదుగా యాజమాన్య హక్కుల పట్టాలు పంపిణీ.**

**1986 లో ఎన్టీఆర్ కేటాయించిన స్థలాలకు 40 ఏళ్ల తర్వాత చట్టబద్ధ హక్కులు.**

**రూ.120 కోట్ల విలువైన ఆస్తులకు యాజమాన్య హక్కులు యార్లగడ్డ.**

**జీవో 306 తో నిడమానూరు కుటుంబాలకు శాశ్వత హక్కులు.**



విజయవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 28: రూరల్ మండలం నిడమానూరు రామానగర్ లో దశాబ్దాలుగా నివసిస్తున్న 316 పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల పై చట్టబద్ధ మైన యాజమాన్య హక్కులు లభించనున్నాయి. 1986 లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కేటాయించిన స్థలాల్లో నివసిస్తున్న కుటుంబాలకు ఈ నెల 30 న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను అందజేయనున్నట్లు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నిడమానూరు రామానగర్ మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా సొంత ఖర్చులతో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నా యాజమాన్య పత్రాలు లేకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని అన్నారు. ఇళ్లను విక్రయించ లేకపోవడం, బ్యాంకు రుణాలు పొందలేకపోవడం వంటి సమస్యలు ఈ పట్టాలతో శాశ్వతంగా పరిష్కారమవుతాయని చెప్పారు. న్యాయపర మైన, పరిపాలనాపర మైన అడ్డంకులను అధిగమించి జీవో 306 ద్వారా నిడమానూరు లబ్ధిదారులకు మార్గం సుగమం చేశామని, పంపిణీ చేయనున్న స్థలాల విలువ సుమారు రూ.120 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ఇక పై మధ్యవర్తులకు కమిషన్లు ఇవ్వాల్సిన అవసరం లేకుండా నేరుగా బ్యాంకు రుణాలు పొందే అవకాశం కలుగుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ ఆలోచనతో జీవో 30, జీవో 306 విధానాలు అమల్లోకి వచ్చాయని, వాటి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది పేదలకు చట్టబద్ధ హక్కులు లభిస్తున్నాయని వివరించారు. గత శాసనసభ్యుడు దొంగ పట్టాలతో ప్రజలను మోసం చేశాడని.. కానీ తాను ప్రస్తుతం శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించే విధంగా కృషి చేశానని చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో ఇప్పటికే గన్నవరంలో 500 మందికి, బాపులపాడులో 426 మందికి, పి నైనవరంలో 289 మందికి, పాతపాడు లో 56 మంది ఎస్టీలకు పట్టాలు అందించినట్లు గుర్తు చేశారు. నిడమానూరు పంచాయతీ పరిధిలో ఇప్పటికే రూ.5.51 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రామానగర్‌లో ప్రధాన రహదారుల నిర్మాణానికి మరో రూ.92 లక్షలు కేటాయించామని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటు, నూతన బస్ షెల్టర్ నిర్మాణం చేపడుతున్నామని, జాతీయ రహదారిపై డివైడర్ ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మాట్లాడామని వెల్లడించారు. ఆర్టీసీ డివిజనల్ మేనేజర్‌తో చర్చించి బస్ స్టాప్ ఏర్పాటును కూడా పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కృష్ణా నది నీటిని వినియోగించి నిడమానూరు వాసులకు సురక్షిత మంచినీటి సదుపాయం కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా పేదల ఇళ్ల స్థలాల కలను సాకారం చేసే కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజయ్యపేటలో పట్టపగలు చోరీ

## అపహరణకు గురైన నాలుగు తులాల బంగారం, 20 తులాల వెండి





నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 28:
మండలంలో మత్స్యకార గ్రామం రాజయ్యపేటలో పట్టపగలు చోరీ జరిగింది. నక్కపల్లి సిఐ జె మురళి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజయ్యపేట గ్రామంలో సోమవారం
ఉదయం సుమారు 09:00 గంటల సమయంలో చోడిపల్లి చిట్టెమ్మ, వయస్సు 50 సంవత్సరాలు, తన ఇంటి తలుపులు వేసుకొని ఎటువంటి తాళం వేయకుండా గ్రామంలో వేరొకరి ఇంటికి వెళ్లారు. సుమారు గంట సమయం తర్వాత తిరిగి వచ్చి ఇంటి తలుపులు తెరిచి చూడగా, ఇంటి వెనుక వైపు తలుపు తెరిచి ఉండడాన్ని గమనించింది. ఇంట్లో ఉన్న ట్రంక్ పెట్టె కనిపించక పోవడంతో ఇంట్లో చోరీ జరిగినట్టు గుర్తించింది. ట్రంక్ పెట్టెలో ఉన్న రెండు గాజులు (02 తులాలు), పుస్తెలతాడు, శతమానాలు కలిపి 02 తులాలు, మొత్తం 04 తులాల బంగారు ఆభరణాలు, అలాగే 20 తులాల వెండి పట్టీలు దొంగతనానికి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు నక్కపల్లి సీఐ జె. మురళి సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం ప్రారంభించామని అయన తెలిపారు.

# విశాఖలో వైద్య విద్యార్థిని శ్రావణి ఆత్మహత్య

విశాఖపట్నం నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఉన్నత చదువుల కోసం నగరానికి వచ్చిన ఓ వైద్య విద్యార్థిని తన జీవితాన్ని అర్ధాంతరంగా ముగించింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఏఎంసీ)లో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రావణి (22) అనే యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌కు చెందిన శ్రావణి విశాఖ ఏఎంసీలో పీజీలో చేరింది. నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చినవాల్తేరులో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. సోమవారం ఉదయం ఆమె తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు.
ఎస్ఐ శకుంతల ఆధ్వర్యంలో పోలీసులు పరిసరాలను పరిశీలించి, కేసు నమోదు చేశారు. శ్రావణి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని,
అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) మార్చురీకి తరలించారు. ఉన్నత భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని ఇలా ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా విషాదాన్ని నింపింది.

# నేడు అనకాపల్లిలో నమో సేవా గాధ కార్యక్రమం.

**కూటమి నేతలు, బిజెపి కార్యకర్తలు, మోదీ అభిమానులు భారీగా పాల్గొనండి.**



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 28:** జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర రావుప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుపరిపాలన సందర్భంగా దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుండి, అక్టోబర్ 17 వరకు చేపడుతున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నేడు నూకాలమ్మ ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న సత్యా గ్రాండ్ కళ్యాణ మండపంలో సాయంత్రం 6 గంటల నుండి నమో సేవా గాధ అనే నాటికను ప్రదర్శించడం జరుగుతుందని అనకాపల్లి బీజేపీ పార్టీ అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వర రావు తెలిపారు. మోదీ 25 ఏళ్లుగా ఈ దేశానికి చేస్తున్న సేవను నాటిక రూపంలో ఈ సందర్భంగా తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, బిజెపి కార్యకర్తలు, మోదీ అభిమానులు ప్రజలు భారీగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దాడి వీరు నాయుడు, పరవాడ మండలం మహిళా మోర్చా అధ్యక్షురాలు మడక పార్వతీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగత్ సింగ్ 119 వ జయంతి.



**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 28:** భగత్ సింగ్ 119 వ జయంతి వేడుకలు పరవాడ మండలం కేంద్ర మైన పరవాడలో సోమవారం ఘనంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది.
ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసు లోనే పోరాడిన భగత్ సింగ్ ను బ్రిటిష్ వాళ్లు ఉరి శిక్ష విధించారన్నారు. తన ప్రాణాలను దేశం కోసం భగత్ తృణ ప్రాయంగా అర్పించారని, భగత్ సింగ్ కలలు కన్న దోపిడీ లేని సమాజం కోసం ప్రజలందరూ పోరాడాలని అన్నారు. నేటికీ అందరికీ ఉపాధి, విద్య, వైద్యం అందని ద్రాక్షల ఉందని, పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పెట్టుబడి దారులకి అప్పగిస్తుందని దీంతో నిరుద్యోగ సమస్య తీవ్రం అవుతుందని దీని పై జన్ జి యువత ప్రభుత్వ విధానాల పై పెద్ద ఎత్తున పోరాటం చేసిందని అన్నారు. నేటి ప్రస్తుత ఎలక్షన్ కమిషన్ దేశంలో పౌరుల ఓట్లను తొలగించే ప్రక్రియ ఎస్ ఐ ఆర్ ని తీసుకొచ్చి ప్రజాస్వామ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తుందని, రాజకీయాలకతీతంగా వ్యవహరించవలసిన ఎలక్షన్ కమిషనర్ బిజెపికి వంత పాడడం దుర్మార్గమని వీరిని వెంటనే విధుల నుండి తొలగించాలని కోరుతూ యువత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టి అన్నపూర్ణ, రవణమ్మ, సీత, బేగం, సరోజిని, మంగ, సత్యవతి,తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళా గోడ పత్రిక ఆవిష్కరణ




**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 28:** పాయకరావుపేటలో ఈనెల 30న నిర్వహించే మెగా జాబ్ మేళాను యువత వినియోగించుకోవాలని పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. హోమ్ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా గవర్నమెంట్ ఐ టి ఐ , పాయకరావుపేట నందు సుమారు 15 కంపెనీలతో నిర్వహించబోయే మెగా జాబ్ మేళా యొక్క గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ , ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి, ఐ టి ఐ, డిప్లొమా, బీటెక్, డిగ్రీ, పి జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో ఉదయం 9గంటలకు హాజరు కావాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంట్ అధికారి వంశీ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**అధిక లోడుతో ఉన్న వాహనానికి రూ. 54వేలు జరిమానా**

**సి ఐ జే మురళి**



**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 28:** నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని నక్కపల్లి సిఐ జె.మురళి అన్నారు.నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తుని నుండి విశాఖపట్నం వైపు రాళ్ల లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ లారీని సోమవారం వేంపాడు వద్ద నక్కపల్లి పోలీసులు తనిఖీ చేసి, అధిక లోడ్ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సదరు లారీని ఆర్టీఓ అధికారులకు అప్పగించగా, నిబంధనల ప్రకారం ఆర్టీఓ అధికారులు రూ 54,000లు జరిమానా విధించారని మురళి తెలిపారు.అధిక లోడుతో వాహనాలు నడిపి రహదారి భద్రతకు ప్రమాదం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని నక్కపల్లి సి ఐ మురళి తెలిపారు.

# తెలంగాణ సీజేకు ప్రమోషన్

సుప్రీం కోర్టుకు కొత్తగా ముగ్గురు న్యాయమూర్తులు రానున్నారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో సోమవారం సమావేశమైన కొలీజియం మూడు రాష్ట్రాల హైకోర్టుల సీజేల పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని నిర్ణయించింది. వీరిలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ ఉన్నారు. “2026 సెప్టెంబర్ 28న జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు కొలీజియం, కింది హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసింది. జస్టిస్ సునీతా అగర్వాల్, ప్రధాన న్యాయమూర్తి, గుజరాత్ హైకోర్టు (మూల హైకోర్టు: అలహాబాద్) జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, ప్రధాన న్యాయమూర్తి, దిల్లీ హైకోర్టు (మూల హైకోర్టు: అలహాబాద్) జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (మూల హైకోర్టు: ఝార్ఖండ్)” అని సుప్రీం కోర్టు ఓ ప్రకటనలో పేర్కొంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీఎస్ నరసింహ సుప్రీంకోర్టు కొలీజియంలో సభ్యులుగా ఉన్నారు. సుప్రీం కోర్టులో మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 38 కాగా, ప్రస్తుతం 34 మంది న్యాయమూర్తులు ఉన్నారు. ఈ సిఫార్సులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేసిన తర్వాత కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ వీరి నియామకాల ఉత్తర్వుల్ని జారీ చేస్తుంది.



అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, 2023 జూలై నుంచి గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె 1990లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2011 నవంబర్?లో అలహాబాద్ హైకోర్టుకు పదోన్నతి పొందారు. పదోన్నతి పొందితే సుప్రీం కోర్టు పదవీ విరమణ వయస్సు అయిన 65 సంవత్సరాలకు చేరుకోవడానికి ఆమెకు దాదాపు ఐదు సంవత్సరాల సమయం ఉంటుంది.

జస్టిస్ ఉపాధ్యాయ 2023 జూలై నుంచి బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ఆ తర్వాత 2025 జనవరి నుంచి దిల్లీ హైకోర్టు సీజేగా కొనసాగుతున్నారు. ఆయన 1991లో న్యాయవాదిగా నమోదు చేసుకుని, 2011 నవంబర్?లో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. పదోన్నతికి ముందు, ఆయన ఉత్తర ప్రదేశ్ ప్రధాన స్టాండింగ్ కౌన్సెల్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఆపరేషన్ సింగ్, పట్నా, ఝార్ఖండ్ హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. జస్టిస్ సింగ్ దిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఆయన 1990 నుంచి 2000 వరకు పట్నా హైకోర్టులో, ఆ తర్వాత 2012లో ఝార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందే వరకు అక్కడే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2022 డిసెంబర్ 20 నుంచి 2023 ఫిబ్రవరి 19 వరకు ఆ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అనంతరం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది 2023 ఏప్రిల్ 17న ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత 2025 జూలైలో తెలంగాణ హైకోర్టు బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సుప్రీంకోర్టుకు న్యాయమూర్తులుగా కొత్తగా ఐదుగురిని నియమించింది కొలీజియం. పంజాబ్ హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్‌నాగు, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీచంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ, జమ్మూకశ్మీర్-లద్దాఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్‌పల్లి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వెంకిట సుబ్రమణి మోహన పేర్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవులకు పదొన్నతి కల్పించింది.

## ‘సర్’ వివాదం
# సీఈసీ రాజీనామాకు ఖర్గే డిమాండ్.. ప్రతిపక్షంపై నడ్డా ఫైర్

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, సర్, ఈసీ వ్యవహారంపై కాంగ్రెస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. మరోవైపు కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రతిపక్ష ఆరోపణలను ఖండిస్తూ, ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ‘సర్’ వివాదం ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదని, దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన విషయమని ఖర్గే పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ ఈ అంశాన్ని తీవ్రంగా తీసుకుంటుందని చెప్పారు. సర్ అంశంపై చర్చించేందుకు మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇక జ్ఞానేశ్ కుమార్ బీజేపీ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నారని, ఆ పార్టీ కార్యకర్తగా మారారని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



### జైరాం రమేశ్ విమర్శలు
సర్ ప్రక్రియలో పౌరసత్వానికి సంబంధించిన అంశాలను పరిశీలించే విధానం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి బలోపేతం చేసే సుదీర్ఘ ప్రక్రియలో తొలి అడుగు సీఈసీ రాజీనామాతోనే ప్రారంభం కావాలని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాన్షు ధూలియా ఓ ఇంటర్వ్యూలో ఇచ్చిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఓటరు దేశ పౌరుడై ఉండాల్సిందేనని, అయితే పౌరసత్వాన్ని నిర్ణయించడం ఎన్నికల సంఘం బాధ్యత కాదని చెప్పినట్లు తెలిపారు. పౌరసత్వానికి సంబంధించి విస్తృతమైన షరతులు విధించడంపైనా ఆయన ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. భారత పౌరసత్వం 1955 పౌరసత్వ చట్టం పరిధిలోకి వస్తుందని, పార్లమెంట్ కాలానుగుణంగా చేసిన సవరణలకు అనుగుణంగా ఈ చట్టం అమలులో ఉంటుందని చెప్పారు.

### ఖర్గే వ్యాఖ్యలకు నడ్డా కౌంటర్
కాంగ్రెస్ విమర్శళకు కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈసీపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. ఈసీ ఇప్పటికే తమ వివరణ ఇచ్చిందని, అయినప్పటికీ ప్రతిపక్ష నేతలు అదే ఆరోపణలను కొనసాగిస్తున్నాయని విమర్శించారు. లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తదితర ప్రతిపక్ష నేతలు ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల కంటే ఆరోపణలు, గందరగోళానికి ప్రాధాన్యత ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధమైన, స్వతంత్ర సంస్థలపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రతిపక్ష రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారిందని ఆరోపించారు. రాహుల్ గాంధీని ఉద్దేశించి ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పినంత మాత్రాన అది నిజం కాదని తెలిపారు. ఈసీ ఇచ్చిన వివరణల తర్వాత కూడా ప్రతిపక్షాలు ఆరోపణలు కొనసాగిస్తున్నాయని విమర్శించారు.

సర్, ఓటర్ల జాబితాకు సంబంధించిన కొన్ని నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు 10 నెలల వ్యవధిలో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పలు కథనాలు వెలువడ్డాయి. ఫారం-6, ఓటర్ల పేర్ల తొలగింపు, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్ కు సంబంధించిన అంశాలపై ఈ అభ్యంతరాలు ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఎన్నికల సంఘం మాత్రం ఈ అభిప్రాయాలు నిర్ణయాత్మక దశకు ముందు జరిగే సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమని తెలిపింది. తుది నిర్ణయాలు మాత్రం ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్? కుమార్? రాజీనామా చేయాలని కాంగ్రెస్?తో పాటు సీపీఐ, సీపీఐ(ఎం), టీఎంసీ, శివసేన(యూబీటీ) వంటి ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయనపై అభిశంసనకు కూడా సిద్ధమయ్యాయి.

# ‘హార్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను తరిమికొట్టాం

హార్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను అరేబియా సముద్రం వైపు తరిమికొట్టినట్లు ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ తెలిపారు. త్వరలోనే శత్రువులను అరేబియా సముద్రం నుంచి కూడా తరిమికొడతామని చెప్పారు. హార్మూజ్ జలసంధిలో శత్రుదేశాలు స్వేచ్ఛగా సంచరించకుండా తమ దళాలు అడ్డుకున్నాయని ప్రశంసించారు. యుద్ధం, చర్చల్లో ఏదొకటి తేల్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇరాన్ తేల్చిచెప్పింది. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ చేసిన ప్రతిపాదనలను ట్రంప్ తిరస్కరించిన వేళ ఇరాన్ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. మరో దఫా దాడులకు సిద్ధమని ఇరు దేశాలు ప్రకటించడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ క్రమంలోనే హెజ్‌బొల్లా మాజీ నాయకుడు హసన్ నస్రల్లా వర్ధంతి సందర్భంగా మొజ్తబా ఖమేనీ ఇరాన్ పౌరులను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశం పంపారు. హార్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను అరేబియా సముద్రం వైపు తరిమికొట్టినట్లు ఖమేనీ తెలిపారు. త్వరలోనే శత్రువులను అరేబియా సముద్రం నుంచి కూడా తరిమికొడతామని చెప్పారు. హార్మూజ్ జలసంధిలో తమ సైనికుల చేతిలో చావు దెబ్బ తిన్న శత్రువులు, అరేబియా సముద్రం దాటి ముందుకు రావడానికి సాహసించడం లేదన్నారు. ఇరాన్‌పై దాడులకు దిగిన ప్రతిసారి శత్రువులు భారీ నష్టాన్ని మూటగట్టుకున్నారని పేర్కొన్నారు. “ఇరాన్?లోని రెండు దక్షిణ సముద్రాలు శత్రు బలగాలు సంచరించే ప్రదేశాలుగా ఉండేవి. అయితే, హార్మూజ్ జలసంధిలో ధైర్యవంతులైన ఇరాన్? యోధుల నుంచి వారు పొందిన ఎదురుదెబ్బల కారణంగా అరేబియా సముద్రాన్ని దాటి ముందుకు రావడం లేదు. వారు ఈ వైపునకు వచ్చి,



తమకు తామే హానిని తెచ్చుకున్నారు. త్వరలోనే అరేబియా సముద్రం కూడా వారి నుంచి విముక్తి పొందుతోంది. మనల్ని బలహీనపరచడానికి శత్రువులు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. కానీ ఇప్పుడు సమాజంలోని వివిధ వర్గాల మధ్య స్పష్టమైన విభేదాలు ఉన్నప్పటికీ, పవిత్రమైన హార్మూజ్ జలసంధి పరిరక్షణతో సహా తమ హక్కులను నిలబెట్టుకోవడంలో దృఢంగా నిలబడుతున్నారు.” అటు హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు తాము చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించగా ఇరాన్ దీటుగా స్పందించింది. అమెరికా మళ్లీ దాడులకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ హెచ్చరించారు. అవసరమైతే అంతిమ యుద్ధానికి కూడా వెనుకాడమని స్పష్టం చేశారు. అదే సమయంలో శాంతి చర్చలకు సిద్ధమని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఏది కావాలో ట్రంప్ తేల్చుకోవాలని అన్నారు. శాంతి కోసమే తాము న్యూయార్క్ వెళ్లామని కాళ్లబేరానికి కాదని అరాగ్చీ వెల్లడించారు. జప్తు చేసిన తమ ఆస్తులు, నిధులను విడుదల చేస్తే హార్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని పునరుద్ఘాటించారు. అయితే, ఇరాన్ ప్రతిపాదనను తిరస్కరించడానికి కొన్ని కారణాలున్నాయని ఐరాసలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్ తెలిపారు. హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడి చేసి, అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని మండిపడ్డారు. అందుకే వారిపై తమకు నమ్మకం లేదని అన్నారు. ఇరాన్ అణు ముప్పు నుంచి ప్రపంచాన్ని రక్షించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలు తీసుకుంటున్నారని మైక్ వాల్జ్ వెల్లడించారు. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో అతి త్వరలోనే అమెరికా విజయం సాధిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మధ్యంతర ఎన్నికలకు ముందే ఇరాన్‌పై సైనిక దాడులు జరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేమని చెప్పారు. యుద్ధాన్ని తాము గెలిచిన వెంటనే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు భారీగా పడిపోతాయన్నారు. ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కకుండా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఆపరేషన్ ఎకనామిక్ ఔట్‌కాస్ట్‌పై మాట్లాడిన ట్రంప్, సైనిక, ఆర్థిక మార్గాల ద్వారా తాము విజయం సాధిస్తామన్నారు. మిలిటరీ పరంగా తాము ఇప్పటికే గెలిచామని, ఆర్థిక ఆంక్షల వల్ల ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందన్నారు. వారి కరెన్సీకి విలువ లేకుండా పోయిందని ఇరాన్‌లో ద్రవ్యోల్బణం దాదాపు 300 నుంచి 318 శాతానికి చేరుకుందన్నారు. అమెరికా నేవీ దిగ్బంధనంతో పోర్టుల ద్వారా ఎగుమతులు నిలిచిపోవడంతో ఇరాన్ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. పొరుగు దేశాల నుంచి సరకులను ఎగుమతి చేస్తోంది. ముఖ్యంగా ఇరాన్- తుర్కియే సరిహద్దు వద్ద కొన్ని కిలోమీటర్ల మేర లారీలు బారులు తీరాయి. రవాణా ఆంక్షలు, తనిఖీల కారణంగా ట్రక్కులు కొన్నిసార్లు వారాలపాటు సరిహద్దులోనే నిలిచిపోవాల్సి వస్తోంది.

## నేపాల్‌లో జలవిలయం..



నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ముస్తాంగ్ జిల్లాలో ఒక భారీ పర్వత భాగం కొద్ది సెకన్ల వ్యవధిలోనే కుప్పకూలి నదిలో కలిసిపోయిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ భయానక దృశ్యాలు ఆ దేశంలో నెలకొన్న విపత్కర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ముస్తాంగ్ జిల్లాలోని లేటే సమీపంలో ఒక భారీ పర్వత భాగం కేవలం ఆరు సెకన్ల వ్యవధిలోనే కాళీ గండకి నదిలోకి జారిపడింది. చార్‌ధామ్ యాత్రికులు చిత్రీకరించిన ఈ వీడియోలో, కొండచరియలు వేగంగా కిందికి దూసుకురావడంతో స్థానికులు భయాందోళనలతో కేకలు వేయడం వినిపిస్తోంది. ఈ ఘటన కారణంగా నదీ ప్రవాహానికి తాత్కాలికంగా ఆటంకం ఏర్పడింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న మరో వీడియోలో, కొండచరియలు విరిగిపడటంతో చెట్లతో పాటు ఒక ఇల్లు కూడా లోయలోకి కొట్టుకుపోయింది. ‘ఘర్ గయా సక్యో (ఇల్లు పోయింది) అంటూ గ్రామస్థులు భయాందోళనలతో హాహాకారాలు చేయడం, ఒక మహిళ రోదిస్తున్న దృశ్యాలు చూసేవారిని కలచివేస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదలు, కొండచరియల విరిగిపడిన ఘటనల్లో ఇప్పటివరకు 24 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది గల్లంతయ్యారు. ప్రతికూల వాతావరణం కారణంగా పలు జిల్లాల్లో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మరోవైపు, మనాంగ్ జిల్లాలోని హిమ్లుంగ్ హిమాల్ బేస్ క్యాంప్ వద్ద సంభవించిన హిమపాతంలో ఇద్దరు మరణించగా, మరో 10 మంది ఆచూకి లభ్యం కాలేదు. నెల రోజుల క్రితం సంభవించిన భోటేకోశీ వరదల విషాదం నుంచి కోలుకోకముందే నేపాల్‌ను మరో విపత్తు చుట్టుముట్టడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

## భారత్‌తో మాది మంచి భాగస్వామ్యం



భారత్‌తో తమ సంబంధాలకు మరింత విస్తరించే అవకాశం ఉందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తెలిపారు. ఇరు దేశాల మధ్య ఇప్పటికే మంచి భాగస్వామ్యం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేకపోయామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, తాను కలిసి ఆ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని వెల్లడించారు. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా న్యూయార్క్‌లో ఆసియా సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో అల్బనీస్ పలు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని అల్బనీస్ తెలిపారు. తాను, మోదీ ఇద్దరూ ప్రధానులుగా ఉన్న సమయంలో ఒకరి దేశాన్ని మరొకరు రెండుసార్లు సందర్శించారని గుర్తు చేశారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు అవకాశం ఉందని చెప్పారు. భారత్‌లో విద్య, భాష, విశ్వవిద్యాలయాలు, క్రీడలు వంటి రంగాల్లో ఆస్ట్రేలియాతో ఇప్పటికే సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. రెండు దేశాలు కామన్వెల్త్‌లో భాగస్వాములు కావడం కూడా ప్రత్యేక అనుబంధానికి కారణమని చెప్పారు.

### మోదీ సభలపై అల్బనీస్ ప్రశంసలు
ఆస్ట్రేలియాలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా జరిగిన భారీ బహిరంగ కార్యక్రమాలను కూడా అల్బనీస్ ప్రస్తావించారు. మోదీ పాల్గొన్న స్టేడియం కార్యక్రమాల్లో కనిపించిన ఉత్సాహం అసాధారణమని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆ కార్యక్రమాల్లో తనకు కూడా ప్రజలు మద్దతుగా నినాదాలు చేశారా అని అడిగినప్పుడు, మోదీ తనను ఉత్సాహపరచాలని అక్కడి ప్రజలను కోరడంతో వారు నినాదాలు చేశారని చెప్పారు. సుమారు 40 వేల మంది ఆస్ట్రేలియన్లు తన పేరును నినదించడం సాధారణ విషయం కాదని, మోదీతో తన స్నేహం కారణంగానే అది సాధ్యమైందని పేర్కొన్నారు. ఇక ఆస్ట్రేలియా ప్రధాని డిసెంబర్?లో భారత్‌లో పర్యటించనున్నారు. జీ20 సదస్సుకు అమెరికా వెళ్లే క్రమంలో భారత్‌కు వస్తానని ఆయన తెలిపారు. అమెరికాలో డిసెంబర్ 14, 15 తేదీల్లో జీ20 సదస్సు జరగనుంది. అంతకుముందు భారత్‌లో అల్బనీస్ పర్యటన కొనసాగనుంది. ఆ పర్యటనలో వ్యాపారం, సంస్కృతి, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ‘జీ’డే నమస్తే పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు. ఇందులో ఆస్ట్రేలియా వ్యాపార సంస్థలు, ఇతర భాగస్వాములు పాల్గొననున్నారు.

### ముంబయిలో వ్యాపార సమావేశాలు
భారత్ పర్యటనలో భాగంగా పెద్ద సంఖ్యలో ఆస్ట్రేలియా వ్యాపార ప్రతినిధులను ముంబయికి తీసుకొస్తానని అల్బనీస్ చెప్పారు. ఆస్ట్రేలియా బిజినెస్ కౌన్సిల్‌తో కలిసి వ్యాపార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత్‌లో పెట్టుబడులు, వ్యాపార అవకాశాలు, ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలపై ఆ కార్యక్రమాల్లో చర్చించే అవకాశం ఉంది. భారత్- ఆస్ట్రేలియా ఆర్థిక సంబంధాల్లో ఇంకా చాలా చేయాల్సి ఉందని అల్బనీస్ చెప్పారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అల్బనీస్ పర్యటనలో క్రీడలకు కూడా ప్రత్యేక స్థానం ఉండనుంది. ముంబయిలో వ్యాపార కార్యక్రమాలు ముగిసిన తర్వాత చెన్నైలో క్రికెట్ మ్యాచ్‌తో పర్యటన కొనసాగుతుందని ఆయన చెప్పారు. విక్టోరియా, వెస్టన్ ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆ మ్యాచ్ జరగనుంది. భారత్-ఆస్ట్రేలియా మధ్య క్రికెట్‌కు ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వ్యాపారం, సంస్కృతి, క్రీడలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అయితే భారత్- ఆస్ట్రేలియా సంబంధాలు కేవలం వ్యాపారం, క్రీడలకే పరిమితం కావడం లేదు. రక్షణ, భద్రత, కీలక ఖనిజాలు, కొత్త సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, విద్య వంటి రంగాల్లోనూ ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. క్వాడ్‌లో భారత్, ఆస్ట్రేలియాతో పాటు అమెరికా, జపాన్ కూడా భాగస్వాములుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అల్బనీస్ డిసెంబరు పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

# ఆ ఫార్ములానే నన్ను గెలిపించింది: లోకేష్



ఎన్నికల్లో గెలుపు మజా ఇస్తుందని.. ఓడిపోతే.. నీరసం వస్తుందని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. అయితే.. గెలుపుతోపాటు ఓటమిని కూడా బలంగా తీసుకోవాలని సూచించారు. 2019లో తాను ఓడిపోయినప్పుడు.. అనేక అవమానాలు ఎదురయ్యాయని తెలిపారు. అయితే.. వాటిని సవాలుగా తీసుకుని.. మళ్లీ ఓడిపోయిన చోటే పోటీ చేయాలని అనుకున్నట్టు తెలిపారు. ఎందుకు ఓడిపోయామో అధ్యయనం చేసి.. దానిని సరిచేసుకుని ముందుకు సాగానని చెప్పారు. ఇదే ఫార్ములా నాయకులకు వర్తిస్తుందన్నారు.ఓటమి తర్వాత కుంగిపోయి.. నియోజనకవర్గాలకు దూరంగా ఉంటే ఇబ్బందులు పెరుగుతాయన్నారు. తాను ఓడిపోయినా.. నియోజకవర్గంలో పర్యటించి ప్రజలను నిరంతరం కలుసుకుని.. వారికి హామీలు ఇచ్చానని గుర్తు చేసుకున్నారు. ఆ నమ్మకమే తనను 93 వేల ఓట్ల మెజారిటీతో గెలిచేలా చేసిందని లోకేష్ వివరించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎటు చూసినా అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ప్రతి విషయాన్నీ రాజకీయ కోణంలోనేకాకుండా.. ప్రజల కోణంలో తాను ఆలోచన చేస్తానన్నారు.తాజాగా సోమవారం ఉదయం మంగళగిరి నియోజకవర్గంలోని 347 మంది పేదలకు ఇళ్ల పట్టాలను నారా లోకేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పట్టాల సమస్య పరిష్కరిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పట్టుదలతో పనిచేస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు 2 వేల కోట్ల రూపాయల విలువైన ఇళ్ల పట్టాలను పేదలకు పంపిణీ చేశామని వివరించారు. ఇక ముందు కూడా ఈ యజ్ఞం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టాదారులకు బట్టలు పెట్టి.. కానుకలు అందించారు. ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేయించారు.

చేసింది చెప్పాలి..

ప్రతి ఎమ్మెల్యే తమ తమ నియోజకవర్గాల్లో పర్యటించాలని లోకేష్ పిలుపునిచ్చారు. చేసింది చెప్పుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని.. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అదేసమయంలో ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా చేస్తున్న మంచిని కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీ చేపట్టిన ఇంటింటికీ కార్యక్రమం హిట్ అయిందన్నారు. వచ్చే ఏడాది కూడా ఈ కార్యక్రమం మరోసారి సాగుతుందన్నారు. ఎన్నికల లోగా.. మూడు సార్లయినా.. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ తిరిగేలా ప్రజలకు మంచిని వివరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

# బొత్స కోటలో మొదలైన ప్రకంపనలు.. టెన్షన్ లో పెద్దాయన!

వైసీపీ సీనియర్ నేత, మండలిలో విపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణకు సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో రాజకీయం గట్టి సవాల్ విసురుతోందని అంటున్నారు. చీపురుపల్లి నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, దాదాపు 15 ఏళ్లపాటు మంత్రిగా పనిచేసిన బొత్స ఇప్పుడు తన రాజకీయ జీవితంలోనే ఎన్నడూ లేనంత విధంగా తిరుగుబాటు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ముందుగా మేనల్లుడు చిన్న శ్రీను ఇచ్చిన షాక్ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటుండగా, ఇప్పుడు కేడర్ కూడా బొత్సకు బైబై చెప్పేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది.విజయనగరం జిల్లా చీపురుపల్లి బొత్స సొంత నియోజకవర్గం. ఇక్కడ నుంచి ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2004, 2009, 2019ల్లో ఎమ్మెల్యేగా గెలిచిన బొత్స ఆ మూడు సార్లు మంత్రి పదవి దక్కించుకున్నారు. అమాత్య పదవితో జిల్లాలో తిరుగులేని ఆధిపత్యం చెలాయించడంతోపాటు రాష్ట్రస్థాయి నాయకుడిగానూ ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఉత్తరాంధ్రలో మిగిలిన నాయకులు అందరికంటే ఎక్కువగా ప్రచారం దక్కించుకున్నారు. ఇక వైసీపీ చేరిన తర్వాత కూడా బొత్స హవాకు ఎదురు ఉండేది కాదని చెబుతున్నారు.2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత 2015లో వైసీపీలో చేరిన బొత్స జిల్లాలో తన సొంత సామ్రాజ్యాన్ని మరింతగా విస్తరించుకున్నారని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ఉంటే.. విజయనగరం జిల్లాలో మాత్రం బొత్స పార్టీ అన్నట్లుగా రాజకీయాలు నడిపారు. ఈ క్రమంలోనే ఉత్తరాంధ్రపైనా పట్టుసాధించి గత ఎన్నికల్లో ఓడిపోయినా ఎమ్మెల్సీ సీటు దక్కించుకున్నారు. అయితే ఇప్పుడు స్థానిక ఎన్నికల ముందు బొత్స పూర్తిగా ఎదురుగాలి అనుభవిస్తున్నట్లు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తన కుమార్తెకు జడ్పీ చైర్మన్ పదవి అంటూ ఆయన చేసిన ప్రకటనతో మేనల్లుడు చిన్న శ్రీను వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిపోగా, ఇప్పుడు బొత్స అనుచరులు కూడా చిన్న శ్రీను వెంట నడుస్తామని



రాజీనామా ప్రకటనలు చేస్తుండటం ప్రకంపనలు రేపుతోందని చెబుతున్నారు.జడ్పీ మాజీ చైర్మన్ చిన్నశ్రీనుకు మద్దతుగా వైసీపీకి చెందిన ఐదుగురు జడ్పీటీసీ మాజీ సభ్యులు ఒకేసారి వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించగా, ఆదివారం బొత్స సొంత నియోజకవర్గంలోని మెరకముడిదాం మండలంలో దాదాపు 13 గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు పార్టీతో తెగతెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. వీరి రాజీనామాతో ఆయా గ్రామాల్లో వైసీపీ తరపున పోటీచేయడానికి సరైన నాయకుడు లేని పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ఇదేవిధంగా గరివిడి, గుర్ల, చీపురుపల్లి మండలాల్లో కూడా త్వరలో రాజీనామాలు ఉంటాయని చెబుతున్నారు.ఇలా సొంత నియోజకవర్గంలో బొత్స పునాదులు కదిలేలా పావులు కదుపుతున్న చిన్న శ్రీను జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోనూ తన అనుచరులను టీడీపీలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం రాజకీయాన్ని మరింత వేడెక్కిస్తోంది. ముఖ్యంగా తన మేనమామలు అయిన బొత్స సత్యనారాయణతోపాటు ఆయన సోదరుడు బొత్స అప్పలనరసయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాల్లో వైసీపీ నుంచి భారీ వలసలు ఉండేలా చిన్నశ్రీను పాచికలు వేస్తుండటమే హాట్ టాపిక్ అవుతోంది. చిన్న శ్రీను దూకుడుకి బొత్స కళ్లెం వేయాలని, లేనిపక్షంలో వైసీపీ పార్టీ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని కార్యకర్తలు కోరుకుంటున్నారు. అటు బొత్స కూడా నష్టనివారణకు ఎన్నడూ లేనివిధంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని చెబుతున్నారు. ఏదిఏమైనా అధికార పార్టీలో చేరడంతో చిన్నశ్రీనుకు అన్నివిధాలా కలిసివస్తుందని చెబుతున్నారు.

# మెగా బ్యాక్ స్టెప్...

ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా కొమ్మూరు సమీపంలో ప్రముఖ మౌలిక వసతుల కల్పన సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్‌కు కేటాయించిన భారీ 2,000 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణపరమైన, భౌగోళికపరమైన అడ్డంకుల దృష్ట్యా ఈ ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో చేపట్టడం సాధ్యం కాదని, అందువల్ల ప్రాజెక్ట్ కేటాయింపును రద్దు చేయాలని స్వయంగా మేఘా సంస్థే ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేయడంతో కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 2022-2023 కాలంలో రాష్ట్రంలో భారీ ఎత్తున పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేశారు. పర్యావరణహిత హరిత ఇంధన నిల్వ విధానంలో భాగంగా అన్నమయ్య జిల్లా సంబేపల్లి పరిసర ప్రాంతాల్లోని కొమ్మూరు వద్ద 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను న్యూ , రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ద్వారా మేఘా సంస్థకు కేటాయించారు. భారీ ఎత్తున పెట్టుబడులు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయనే ప్రచారంతో నాడు అనుమతులు వేగంగా మంజూరైనప్పటికీ.. ప్రాథమిక సర్వే దశలోనే అసలైన పర్యావరణ చిక్కులు తెరపైకి వచ్చాయి.ప్రాజెక్టు రద్దుకు గల ప్రధాన సాంకేతిక, పర్యావరణ కారణాలను పరిశీలిస్తే.. ప్రతిపాదిత కొమ్మూరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ అత్యంత సున్నితమైన పర్యావరణ పరిధిలోకి వస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం గుర్తించిన ఎగువ, దిగువ జలాశయాలు , ప్రసార మార్గాలు నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ విస్తరణ ప్రాంతాలు, పరిసర అటవీ శ్రేణులు, శ్రీ లంకమల్లేశ్వర వన్యప్రాణి అభయారణ్యం పరిధిలోకి వస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం పులుల సంరక్షణ కేంద్రాలు, రక్షిత అటవీ ప్రాంతాల్లో ఇంతటి భారీ తవ్వకాలు, సొరంగాల నిర్మాణం, జల నిల్వలకు అనుమతులు లభించడం దాదాపు అసాధ్యం. తీవ్రమైన అటవీ, వన్యప్రాణి ఆంక్షల వల్ల ప్రాజెక్ట్ సాధ్యపడదని మేఘా సంస్థ నిర్ధారించుకుంది.జాతీయ వన్యప్రాణి బోర్డు నుంచి క్లియరెన్సులు సాధించడం సాధ్యం కాకపోవడం, చట్టపరమైన వివాదాలు తలెత్తే ముప్పు ఉండటంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేమని మేఘా సంస్థ చేతులెత్తేసింది. ఈ మేరకు సంస్థ చేసిన అభ్యర్థనను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం.. కేటాయింపులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగితాలపై ఎలాంటి క్షేత్రస్థాయి పర్యావరణ అధ్యయనాలు చేయకుండా గత ప్రభుత్వ హయాంలో గుడ్డిగా అనుమతులు ఇవ్వడం వల్లే ఇప్పుడు ప్రాజెక్టులు అర్ధాంతరంగా రద్దవుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**దాల్మియాకు భూ కేటాయింపులు**

రాయలసీమ పారిశ్రామిక హబ్‌గా మారుతున్న వైఎస్సార్ కడప జిల్లాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం, కడప జిల్లాలో ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ 'దాల్మియా సిమెంట్స్' భారీ విస్తరణ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో

భాగంగా పరిశ్రమ విస్తరణకు అవసరమైన 250 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.మైలవరం మండలం చిన్నకొమ్మర్ల గ్రామ పరిధిలో ఉన్న దాల్మియా సిమెంట్స్ ప్లాంట్ విస్తరణకు ఈ భూమిని కేటాయించారు. అయితే ఈ కేటాయింపుల్లో ప్రభుత్వం అత్యంత పారదర్శక విధానాన్ని అవలంబించింది. సాధారణంగా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు కాకుండా, వాస్తవ ఖరీదు ప్రాతిపదికన మాత్రమే ఈ 250 ఎకరాల భూమిని సంస్థకు బదిలీ చేయడం విశేషం. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూనే, ప్రభుత్వ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ భూ కేటాయింపు మరియు కొత్త యూనిట్ స్థాపనతో దాల్మియా సిమెంట్స్ తన వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోనుంది. ప్రస్తుతం ఉన్న 7.23మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం) నుండి ఏకంగా 9.60 కు ఉత్పత్తిని పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. దీంతో ఈ ప్లాంట్ దక్షిణ భారతదేశంలోనే దాల్మియా గ్రూప్‌నకు చెందిన అత్యంత పెద్ద ఇంటిగ్రేటెడ్ ప్యాక్టరీగా రూపాంతరం చెందబోతోంది.

# జగన్ మరో పరామర్శయాత్ర.. పోలీసులు ఏమన్నారంటే!



**హైదరాబాద్ :** వైసీపీ అధినేత జగన్.. ఇటీవల కాలంలో తన పార్టీ నాయకులను పరామర్శించేందుకు బయటకు వస్తున్నారు. వివిధ కేసుల్లో చిక్కుకుని జైలు జీవితం గడుపుతున్న వారిని ఆయన పలకరిస్తున్నారు. అయితే ఈ పరామర్శలు.. యాత్రగా మారుతున్నాయి. అదేసమయంలో బలప్రదర్శనగా కూడా మారుతున్నాయి. దీంతో జగన్ యాత్రలకు వచ్చే వారిని నియంత్రించడం.. పోలీసులకు కూడా సవాల్‌గా మారుతోంది. దీంతో అనుమతులు కూడా ఇవ్వడం లేదు. ఇక, తాజాగా జగన్ మరో పరామర్శయాత్రకు రెడీ అయ్యారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ నాయకుడు కాకుమాను రాజశేఖర్ ఇటీవల మృతి చెందారు. విజయవాడ లో వైసీపీ నేతలు నిర్వహించిన డీఎస్సీ-2025పైనిరసనలో ఆయన కూడా పాల్గొన్నారు. అనంతరం.. ఇంటికి వెళ్లిన తర్వాత.. గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఈ ఘటన జరిగి రెండు మూడు రోజులు అయిపోయింది. అయితే.. తాజాగా రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ రెడీ అయ్యారు. దీనికి సంబంధించి ప్రకాశం ఎస్పీకి నాయకులు వినతి ఇచ్చారు.

**షరతులు ..**

వైసీపీ అధినేత జగన్.. మంగళవారం ఉదయం ఒంగోలు వచ్చి.. కాకుమాను కుటుంబాన్ని పరామర్శించేందుకు పోలీసులు ఓకే చెప్పారు. అయితే.. ఎలాంటి ర్యాలీలు, ప్రదర్శనలు.. చేయడానికి వీల్లేదన్నారు. అలాగే.. బ్యానర్లు, ప్లకార్డులు బైక్ ర్యాలీలు చేయరాదని కూడా తేల్చి చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే.. కేసులు తప్పవని హెచ్చరించారు. అయితే.. ఇప్పటివరకు జగన్ చేసిన యాత్రలను గమనిస్తే.. పోలీసులు ఆంక్షలు విధించడం.. నాయకులు ఉల్లంఘించడం కామనైపోయిందన్న విషయం తెలిసిందే.

**ఎవరీ కాకుమాను?**

వైసీపీ హయాంలో కాకుమాను రాజశేఖర్.. ఆంధ్రప్రదేశ్ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశా రు. ఇటీవలి వరకు వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడిగా, పార్టీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిం చారు. ఈ నెల 22న విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద డీఎస్సీ పై వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొన్నా రు. అనంతరం. . ఆయన గుండెపోటుతో మృతి చెందారు. పార్టీలో సీనియర్ నేతగానే కావడంతో.. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గం అభ్యర్థిగా కూడా ఆయన పేరు పరిశీలనలో ఉందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

## వైసీపీ ట్రాప్ లో లోకేశ్...

**రాజమండ్రి, సెప్టెంబర్ 28, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ-బీజేపీ-జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.. విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.ఈ వ్యవహారంపై లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా?రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు.అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది. రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ-బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చనేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపారేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

## గ్రామకంఠం భూములపై సీఆర్డీఏ క్లారిటీ..

## మినహాయింపులకు కటాఫ్ తేదీ ఇదే

**విజయవాడ, సెప్టెంబర్ 28,** ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని గ్రామకంఠం మినహాయింపులపై సీఆర్డీఏ శనివారం స్పష్టత ఇచ్చింది. 08-12-2014ను కటాఫ్ తేదీగా నిర్ణయించి.. ఆ తేదీకి ముందే నిర్మాణాలు ఉన్న భూములు, చదరపు గజాల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు చేసుకున్న ప్లాట్లను నిబంధనల ప్రకారం మినహాయింపునకు పరిశీలన చేసినట్లు తెలిపింది. గ్రామ నివాస ప్రాంతానికి దూరంగా ఉన్న ఖాళీ వ్యవసాయ భూములు, కటాఫ్ తర్వాత రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు మినహాయింపు వర్తించదని సీఆర్డీఏ తెలిపింది. ఇప్పటికే 6,473.72 ఎకరాలను ఎల్‌పీఎస్ నుంచి మినహాయించినట్లు సీఆర్డీఏ తెలిపింది. కమిటీకి వచ్చిన 685 దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు పేర్కొంది. రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, రిజిస్ట్రేషన్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. తాజా అప్లికేషన్లు, అభ్యంతరాలను జేసీ ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి ఖరారు చేస్తుందని సీఆర్డీఏ ఓ ప్రకటనలో తెలిపింది. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అన్ని ప్రయోజనాలు అందిస్తామని తెలిపింది. విజయవాడలో దశాబ్దాల నాటి ఇళ్ల పట్టాల సమస్యకు ఏపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించింది. పేదల సొంతింటి కలకు భరోసా కల్పించేందుకు రెడీ అయింది. విశాఖలో 28,445 కుటుంబాలకు పట్టాలిచ్చిన తరహాలో ఈనెల 30న విజయవాడలో మరో భారీ కార్యక్రమం చేపట్టనుంది. 24,057 కుటుంబాలకు రూ.9,800 కోట్ల విలువైన భూమిపై క్రమబద్ధీకరణ పట్టాలను సీఎం చంద్రబాబు అందించనున్నారు. ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పేదల సొంతింటి కలను నెరవేర్చనున్నారు. ఇళ్ల పట్టాల పంపిణీతో ఒక్కో కుటుంబానికి సుమారు రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ప్రయోజనం చేకూరనుంది. తమ ఇళ్లకు శాశ్వత హక్కులు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు కోరుతున్నారు. వారి కల సాకారం నేడు సాకారం కానుంది. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. మొత్తం 15 మండలాల్లోని 617 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 29.86 లక్షల చదరపు గజాల స్థలాలపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయనుంది.

## బిజినెస్

# లిస్టింగ్ తప్పించేందుకు టాటా సన్స్ పునర్వ్యవస్థీకరణ

### కంపెనీ బోర్డుకు టాటా ట్రస్ట్ ప్రతిపాదన




టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటాసన్స్‌ను లిస్టింగ్ నుంచి తప్పించేందుకు అందులోని మెజారిటీ వాటాదారైన (66%) టాటా ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. టాటా సన్స్‌ను పునర్వ్యవస్థీకరించాలని బోర్డుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా టాటా సన్స్‌లో రెండు ఆపరేటింగ్ కంపెనీలను విలీనం చేయాలని పేర్కొంది. తద్వారా స్టాక్ మార్కెట్ లిస్టింగ్ అవసరాన్ని తప్పించాలని భావిస్తోంది. ఈ మేరకు టాటా ట్రస్ట్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా టాటా ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ , టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ లను టాటా సన్స్‌లో విలీనం చేయాలని టాటా ట్రస్ట్ ప్రతిపాదించింది. ఈ ప్రణాళికను పరిశీలించాలని టాటా సన్స్ బోర్డుకు ప్రతిపాదనలు పంపించింది. ఈ విలీన ప్రక్రియ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ముందస్తు నిరభ్యంతర పత్రం పొందాల్సి ఉంటుంది.

**ఎందుకీ నిర్ణయం?**

ప్రతిపాదిత పునర్వ్యవస్థీకరణ వల్ల టాటా సన్స్ మళ్లీ ఆపరేటింగ్ కంపెనీగా మారుతుంది. ఈ విలీనం పూర్తయితే, టాటా సన్స్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ లేదా కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ నిబంధనల పరిధిలోకి రాదు. 2004లో టీసీఎస్ ప్రత్యేక అనుబంధ సంస్థగా విడిపోకముందు టాటా సన్స్ సొంతంగా వ్యాపార కార్యకలాపాలు, ఆదాయాలు కలిగి ఉండేదని టాటా సన్స్ గుర్తు చేసింది. తాజా విలీనంతో టాటా సన్స్ మళ్లీ తన పాత ఆపరేటింగ్ మోడల్‌లోకి మారుతుంది. తద్వారా నేరుగా వ్యాపార కార్యకలాపాలు సాగించే సంస్థగా మారుతుంది. టాటా సన్స్‌ను లిస్ట్ చేయకుండా 'అన్‌లిస్టెడ్ ప్రైవేట్ కంపెనీ' కొనసాగించాలన్న టాటా ట్రస్ట్ అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. టాటా సన్స్‌ను లిస్ట్ చేసే ప్రతిపాదనను మొదటి నుంచీ ట్రస్ట్ ఛైర్మన్ నోయల్ టాటా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే.

## ఫ్లిప్‌కార్ట్ బిగ్‌బిలియన్ డేస్.. మోటోరొలా ఫోన్లపై డీల్స్ ఇవే!

బిగ్ బిలియన్‌డేస్ సేల్‌కు సిద్ధమవుతున్న ఫ్లిప్‌కార్ట్ ఒక్కో ఆఫర్‌ను రివీల్ చేసుకుంటూ వస్తోంది. అక్టోబర్ 9 నుంచి ప్రారంభం కానున్న మెగా సేల్‌లో విక్రయించే ఫోన్లపై మోటోరొలా తాజాగా ఆఫర్లు ప్రకటించింది. మోటో ఎడ్జ్, జీ సిరీస్ ఫోన్లతో పాటు సిగ్నేచర్‌పైనా డిస్కౌంట్ అందిస్తోంది. బ్లాక్ మెంబర్‌షిప్ ఉన్నవారు అక్టోబర్ 8 నుంచే ఈ ఆఫర్లు పొందొచ్చు.

**మోటోఫోన్లపై ఆఫర్లు ఇవే..**

ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో మోటోరొలా ఎడ్జ్ 70 ఫ్యూజన్ 8జీబీ128జీబీ వేరియంట్ మోడల్‌ను రూ.29,999కు విక్రయించనున్నారు. ప్రస్తుతం దీని ధర రూ.30,999 ఉంది. మోటోరొలా ఎడ్జ్ 70 ప్రో 8జీబీం 256జీబీ వేరియంట్‌ను రూ.36,999కు విక్రయించనున్నట్లు మోటో ప్రకటించింది. ప్రస్తుతం దీని ధర రూ.39,999 ఉంది. అంటే సేల్‌లో రూ.3 వేలు డిస్కౌంట్ లభించనుంది. మోటోరొలా ఎడ్జ్ 70 ప్రోం 12జీబీం 256జీబీ వేరియంట్ ధర ప్రస్తుతం రూ.47,999గా ఉండగా.. సేల్‌లో రూ.44,999కు లభించనుంది.

# ముందన్నీ పండుగలు.. ఎలక్ట్రానిక్స్ ధరలకు రెక్కలు!




ఈసారి పండగ సీజన్ ప్రారంభానికి ముందే వినియోగదారులకు షాక్ తగులబోతున్నది. ఏసీలు మొబైల్ ఫోన్‌లు , ఎల్‌ఈడీ టీవీలు వాషింగ్ మెషీన్‌లు రిఫ్రిజిరేటర్ల వంటి ఎలక్ట్రానిక్స్ ధరలు అక్టోబర్ 1 నుంచి పెరగబోతున్నాయి. ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను 5 నుంచి 8 శాతం వరకు పెంచేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఏడాదిలో ఇలా ధరలు పెంచడం ఇది మూడోసారి కావడం గమనించవలసిన విషయం. అల్యూమినియం, రాగి, ఉక్కు వంటి ముడిసరుకుల ధరలు భారీగా పెరగడం, రవాణా ఖర్చులు అధికమవడం.. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా కరెన్సీ మారకం విలువలో వస్తున్న హెచ్చుతగ్గులు ఈ పెంపునకు ప్రధాన కారణాలని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఏసీల ధరలు 5 నుంచి 8 శాతం మేర పెరగనుండగా.. టీవీలు, వాషింగ్ మెషిన్ల ధరలు 3-4 శాతం వరకు పెరగనున్నాయి. బ్లూస్టార్, గోద్రెజ్, హయర్, డైకిన్ వంటి సంస్థలు ఇప్పటికే ధరల పెంపును ప్రకటించాయి. ఎల్జీ, వోల్టాస్, హిటాచి బ్రాండ్ ఏసీలను విక్రయించే బాష్ హోమ్ కంఫర్ట్ కూడా సుమారు 5 శాతం ధరలను పెంచినట్లు తెలుస్తున్నది. ముడిసరుకుల ధరల పెరుగుదలవల్లే ధరలు పెంచక తప్పడం లేదని బ్లూస్టార్ ఎండీ బి త్యాగరాజన్ అన్నారు. రాగి ధర గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగిందని, అందుకే ఏసీల ధరలను 5 శాతం పెంచుతున్నామని హయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీష్ చెప్పారు. అయితే డీలర్ల దగ్గర పాత స్టాక్ ఒకటి, ఒకటిన్నర నెలలపాటు అందుబాటులో ఉండే అవకాశం ఉందని, కాబట్టి దీపావళి వరకు వినియోగదారులకు పాత ధరలకే ఉత్పత్తులు లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీపావళి తర్వాత కొత్త ధరలు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయని అంచనా వేస్తున్నారు.

# పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొనుగోళ్లపై పరిమితులు!



దిల్లీ: ప్రైవేటు చమురు సంస్థలైన జియో-బీపీ, నయారా ఎనర్జీ డీజిల్ కొనుగోళ్లపై పరిమితులు విధిస్తున్నాయి. పరిశ్రమలు, బల్క్ వినియోగదారులు రిటెయిల్ ఔట్‌లెట్ల వద్ద కొనుగోళ్లు జరుపుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నాయి. జియో-బీపీ ఒక్కో కస్టమర్‌కు రోజుకు 50 లీటర్లు మాత్రమే విక్రయిస్తుండగా.. నయారా ఎనర్జీ మాత్రం 70-200 లీటర్ల వరకు కొనుగోళ్లకు అనుమతిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వరంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కూడా విక్రయాలపై పరిమితులు విధించే అవకాశం ఉంది.

**ధరలో రూ.40 వ్యత్యాసం**

అంతర్జాతీయంగా ప్రస్తుతం బ్యారెల్ చమురు ధర 108 డాలర్లు పలుకుతోంది. అయితే, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు మే నెల నుంచి రిటెయిల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉంటున్నాయి. అదే సమయంలో పరిశ్రమలు, బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్ ధరలు అంతర్జాతీయ రేట్లకు అనుగుణంగా పెరిగాయి. దీంతో రిటెయిల్ పంపుల వద్ద లభించే డీజిల్‌కు, బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్‌కు మధ్య లీటరుపై దాదాపు రూ.40 వరకు వ్యత్యాసం ఉంటోంది. ఈ క్రమంలో బల్క్ వినియోగదారులు రిటెయిల్ పంపులను ఆశ్రయిస్తున్నారు. పరిశ్రమలు, తయారీ కంపెనీలు.. మెషినరీలు, బ్యాకప్ పవర్ సిస్టమ్‌లు రన్ చేయడానికి బల్క్‌గా డీజిల్‌ను కొనుగోలు చేస్తుంటాయి. అలాగే, టెలికాం కంపెనీలు, హోటళ్లు, మాల్స్, డేటా సెంటర్లు, హాస్పిటళ్లు సైతం ఎమర్జెన్సీ పవర్ కోసం డీజిల్ జనరేటర్లను వినియోగిస్తుంటాయి. ఇందుకోసం 400 నుంచి 600 లీటర్ల వరకు డీజిల్‌ను రిటెయిల్ ఔట్‌లెట్ల నుంచి కొనుగోలు చేస్తుంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనివల్ల రిటెయిల్ పంపుల వద్ద నిల్వలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో సాధారణ వాహనదారులకు కొరత రాకుండా ఉండేందుకు ఈ పరిమితులు విధించినట్లు తెలుస్తోంది. పరిశ్రమల డిమాండ్ పెరిగిన నేపథ్యంలో రవాణా, వ్యక్తిగత ప్రయాణ అవసరాలకు ఇంధనం సరిపడా ఇంధనం అందేలా చూడటానికే తగిన చర్యలు తీసుకుంటున్నామని జియో-బీపీ తెలిపింది. నయారా ఎనర్జీ మాత్రం దీనిపై స్పందించలేదు. దేశంలో జియో-బీపీకి 2,227, నయారాకు 7,105 ఔట్‌లెట్లు ఉన్నాయి. ప్రభుత్వరంగ చమురు కంపెనీలకు మొత్తంగా 1,04,069 పెట్రోల్ పంపులు ఉన్నాయి. వీటిలో ఐఓసీకి 43,289, బీపీసీఎల్‌కు 25,587, హెచ్‌పీసీఎల్‌కు 25,238 చొప్పున ఉన్నాయి.

# ఒకే రోజు 6 సెంచరీలు..

## వన్డే క్రికెట్ చరిత్రలోనే సరికొత్త ప్రపంచ రికార్డు



సెప్టెంబర్ 27, 2026.. వన్డే అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది. ఒకే రోజున వేర్వేరు వేదికల్లో జరిగిన మూడు వన్డే మ్యాచ్‌ల్లో ఏకంగా 6 సెంచరీలతో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. ఒకే రోజు 6 వన్డే సెంచరీలు నమోదు కావడం ఇదే తొలిసారి. అంతకుముందు 5 సెంచరీలు నమోదు కావడమే అత్యధిక రికార్డుగా ఉండేది.తాజాగా ఆ రికార్డు తుడిచిపెట్టుకు పోయింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వేదికగా అధికారికంగా వెల్లడించింది.

**ఈ ప్రపంచ రికార్డులో భాగమైన 6 సెంచరీల వివరాలు ఇవే:**

విరాట్ కోహ్లి: తిరువనంతపురం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి భారీ సెంచరీతో కదం తొక్కాడు. కేవలం 88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్స్‌లతో 139 పరుగులు చేశాడు.

కోహ్లికి తన వన్డే కెరీర్‌లో 55వ సెంచరీ, అంతర్జాతీయ క్రికెట్‌లో 86వ శతకం కావడం విశేషం. ఈ క్రమంలోనే వన్డేల్లో అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసిన ప్లేయర్‌గా కోహ్లి నిలిచాడు.

శుబ్‌మన్ గిల్: ఇక ఇదే మ్యాచ్‌లో భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. 108 బంతుల్లో 110 పరుగులు చేసి భారత్ 296 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించడంలో గిల్ కీలక పాత్ర పోషించాడు.

జస్టిన్ గ్రీవ్స్: తిరువనంతపురం వన్డేలో విండీస్ ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్ (12 ఫోర్లతో 101 పరుగులు) కూడా విరోచిత సెంచరీ నమోదు చేశాడు.

డేవిడ్ మిల్లర్: జోహాన్స్‌బర్గ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో సౌతాఫ్రికా ప్లేయర్ డేవిడ్ మిల్లర్ విధ్వంసకర సెంచరీతో విరుచుకుపడ్డాడు. కేవలం 93 బంతుల్లో 12 ఫోర్లు, 9 సిక్స్‌లతో 142 పరుగులు చేశాడు.

టెంబా బవుమా: ఇదే మ్యాచ్‌లో ప్రోటీస్ కెప్టెన్ టెంబా బవుమా కూడా సెంచరీతో చెలరేగాడు. 116 బంతుల్లో బవుమా 103 పరుగులు చేశాడు.

టామ్ బాంటన్ : లండన్ వేదికగా శ్రీలంకతో జరిగిన సిరీస్ డిసైడర్ మూడో వన్డేలో ఇంగ్లండ్ ఓపెనర్ టామ్ బాంటన్ 126 (105 బంతుల్లో) శతక్కొట్టాడు.

## జావెలిన్‌లో 'డబుల్' జోష్.. లాంగ్ జంప్‌లో శ్రీశంకర్ వెండి వెలుగులు.. !




పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పసిడి వేటలో తడబడినా.. వెండి, కాంస్యాలతో మెరుస్తున్నారు. లాంగ్ జంప్‌లో మురళీ శ్రీశంకర్ అదరగొడుతూ వెండి సాధించాడు. జావెలిన్ త్రోలో ఏకంగా రెండు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. యశ్వీర్ సింగ్ సిల్వర్, రోహిత్ యాదవ్ కాంస్యం కొల్లగొట్టగా.. బాక్సర్లు సూపర్ పంచ్‌తో మరో మూడు పతకాలు ఖరారు చేశారు. మహిళల విభాగంలో లొవ్లీనా బర్గొహైన్(75 కిలోలు), ప్రియా గంఘాస్, కపిల్ పొఖారియా(90 ప్లస్ కిలోలు)లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. మొత్తంగా.. బాక్సింగ్‌లో ఆరు పతకాలు ఖాయమమ్మాయి. ఐచీ నగోయ ఆతిథ్యమిస్తున్న 18వ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ మురళీ శ్రీశంకర్ రజతం సాధించాడు. పురుషుల లాంగ్ జంప్ ఫైనల్లో గాయపడిన అతడు చివరి రెండు ప్రయత్నాల్లో దూకలేదు. మోకాలి గాయం వేధించడంతో 8.07 మీటర్లతో రెండో స్థానంలో నిలిచిన అతడు.. చివరకు వెండిని అందుకున్నాడు. ఇదే విభాగంలో భారత అథ్లెట్ డేవిడ్ సొలొమాన్ 7.70 మీటర్ల దూరం దూకి ఏడో స్థానంతో నిరాశపరిచాడు. కాసేపటికే జావెలిన్ త్రోలో భారత అథ్లెట్లు యశ్వీర్ సింగ్, రోహిత్ యాదవ్‌లు అదరగొట్టారు. ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా గైర్హాజరీలో పతక బాధ్యత తీసుకున్న ఈ ఇద్దరూ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో రుమేశ్ పతిరంగ(శ్రీలంక) 88.55 మీటర్లతో పసిడి సాధించగా.. యశ్వీర్ చివరి ప్రయత్నంలో అత్యుత్తమంగా 85.72మీ, రోహిత్ 84.68మీ దూరం ఈటెను విసిరి వరసగా వెండి, కాంస్యాలు ఒడిసిపట్టారు.

**5-0తో గెలుపొంది**

కామన్వెల్త్ క్రీడల్లో తేలిపోయిన బాక్సర్ లొవ్లీనా బొర్గొహైన్ ఆసియాడ్‌లో మెరిసింది. క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియా బాక్సర్‌పై పంచ్‌ల వర్షం కురిపించింది. ఏకపక్ష పోరులో 5-0తో గెలుపొందిన లొవ్లీనా దర్జాగా సెమీస్‌లో అడుగుపెట్టింది. పురుషుల 90 ప్లస్ కిలోల ఫైట్‌లో కపిల్ పొఖారియా ధాటికి దక్షిణ కొరియా బాక్సర్ కిమ్ గిచాయే చేతులెత్తేశాడు.

## స్పోర్ట్స్

# మళ్లీ పసిడి దక్కలే.. 5 వేల స్టీపుల్ చేజ్‌లోనూ పారుల్‌కు కాంస్యమే..!




ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పసిడి పతకానికి దూరమవుతున్నారు. మెరుగైన ప్రదర్శన చేస్తున్నా సరే వెండితో లేదా కాంస్యంతోనో సరిపెట్టుకుంటున్నారు. నగోయలో సీనియర్ స్ప్రింటర్ పారుల్ చౌదరీ పతక వేట కొనసాగుతోంది. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో కాంస్యం సాధించిన తను.. రోజు వ్యవధిలోనే దేశానికి మరో పతకం అందించింది. సోమవారం మహిళల 5వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్ ఫైనల్లో సత్తా చాటిన పారుల్ మూడో స్థానంలో నిలిచింది. పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో పారుల్ చౌదరీ మరో పతకం కొల్లగొట్టింది. ఇప్పటికే మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో కాంస్యంతో మెరిసిన ఈ వెటరన్ ఈసారి 5వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లోనూ తళుక్కుమంది. సోమవారం జరిగిన ఫైనల్లో మూడో స్థానంతో కాంస్యంను ఒడిసిపట్టింది తను. పసిడి పోరులో ఆమె 15:14.61 సెకన్లలో పరుగు పూర్తి చేసింది. అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన కంటే 10 సెకన్లు ఆలస్యంగా పరుగెత్తింది పారుల్. గత ఎడిషన్ ఆసియాడ్‌లో స్వర్ణ పతకం పట్టేసిన పారుల్ ఈసారి కంచుమోతతోనే సరిపెట్టుకుంది. ఈ విభాగంలో కెన్యా అథ్లెట్ విన్‌ఫ్రెడ్ యవి (ఔఱఅఅటతీవసగ్ఖజఱ) ప్రథమ స్థానంలో నిలిచి పసిడిని ఎగరేసుకుపోయింది.

# పేదరికం నుంచి సినీ రంగానికి.. నటి కవిత ప్రస్థానం

పశ్చిమగోదావరి జిల్లా నిడమర్రులో 1965 సెప్టెంబర్ 28న కవిత జన్మించారు. ఆమె ఆరు నెలల వయసులోనే కుటుంబం హైదరాబాద్‌కు వచ్చింది. ఆరేళ్ల వయసులో మద్రాస్‌కు మకాం మార్చారు. అక్కడ ఆమె తండ్రి వ్యాపారం చేసి తీవ్రంగా నష్టపోవడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఒకపూట భోజనం పెట్టడమే కష్టమైన పరిస్థితుల్లో చదువు చెప్పించే స్థోమత లేకపోయింది. దీంతో మద్రాస్‌లో తెలుగువారి కోసం ఉచితంగా విద్య అందించే ప్రభుత్వ పాఠశాలలో కవిత చదువుకున్నారు.అలాంటి సమయంలో ఆమె తండ్రికి కృష్ణయ్య అనే నిర్మాత పరిచయమయ్యారు. కవితను చూసిన ఆయన.. “చక్కగా ఉన్నావు.. సినిమాల్లో నటిస్తావా?” అని అడిగారు. అందుకు కవిత “చదువుకోవాలి” అంటూ తిరస్కరించారు. అయితే తండ్రి బలవంతంతో ఆడిషన్స్‌కు హాజరయ్యారు. అలా 11 ఏళ్ల వయసులో ‘ఓ మంజు’ అనే తమిళ చిత్రంతో కథానాయికగా సినీరంగ ప్రవేశం చేశారు.



**తెలుగులోకి ప్రవేశం**

తెలుగులో ‘సిరిసిరిమువ్వ’ చిత్రంలో జయప్రదకు చెల్లెలి పాత్రలో తొలిసారిగా నటించారు. అనంతరం ‘చుట్టాలున్నారు జాగ్రత్త’ చిత్రంలో పూర్తి స్థాయి కథానాయికగా నటించారు. వరుసగా సినిమాల్లో నటిస్తున్న సమయంలోనే 20 ఏళ్ల వయసులో వివాహం జరిగింది. పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. అప్పటికే చేతిలో ఉన్న కొన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి, సినీ రంగానికి విరామం తీసుకున్నారు.

**వివాహం.. కుటుంబం**

1984లో 20 ఏళ్ల వయసులో సింగపూర్‌కు చెందిన వ్యాపారవేత్త దశరథరాజ్‌ను కవిత వివాహం చేసుకున్నారు. తొలుత చెన్నైలో, ఆ తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంజయ్ రూప్ ఉన్నారు. సంజయ్ రూప్ 2021 జూన్ 15న కోవిడ్–19 అనంతరం అనారోగ్య కారణాలతో కన్నుమూశారు.

వివాహం తర్వాత కొంతకాలం సినీ పరిశ్రమకు దూరంగా ఉన్న కవిత.. ఆ తర్వాత తల్లి, అత్త, వదిన తదితర పాత్రల్లో కనిపిస్తూ క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా ప్రేక్షకులను అలరించారు.

**ఆర్థిక ఇబ్బందులు.. విషాదాలు**

కవిత భర్త ఒకప్పుడు వందల కోట్ల రూపాయల ఆస్తికి అధిపతిగా ఉన్నప్పటికీ, వ్యాపారంలో నష్టాల కారణంగా భారీగా నష్టపోయినట్లు ఆమె ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. భర్తను, కుమారుడిని కోల్పోయిన తర్వాత జీవితంలో తీవ్ర విషాదాన్ని ఎదుర్కొన్నానని, కొన్ని సందర్భాల్లో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు కూడా వచ్చినట్లు ఆమె వెల్లడించారు.తాడేపల్లిగూడెం సమీపంలోని ఓ గ్రామంలో పెంకుటింట్లో జీవించిన తాను సినిమాల్లోకి వచ్చి గుర్తింపు పొందడం ఎంతో గర్వంగా ఉందని కవిత తెలిపారు. నటిగా దక్షిణ భారతదేశంలోని వివిధ భాషల్లో సినిమాలు చేసే అవకాశం దక్కడం తన అదృష్టమని పేర్కొన్నారు.

**11 ఏళ్లకే స్విమ్‌సూట్‌లో..**

తన చిన్ననాటి సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్న కవిత.. 11 ఏళ్ల వయసులోనే తన తొలి సినిమాలో స్విమ్‌సూట్ ధరించి నటించిన విషయాన్ని వెల్లడించారు. ఆ వయసులో దాని గురించి తనకు పెద్దగా అవగాహన లేదని, అప్పట్లో అన్నింటినీ తన తల్లే చూసుకునేవారని చెప్పారు.

“11 ఏళ్లకే నా మొదటి సినిమాలో స్విమ్‌సూట్ వేసుకున్నాను. ఆ వయసులో అది వేసుకోవాలా వద్దా అనే విషయం నాకు తెలియదు. అంతా అమ్మే చూసుకునేది. ఆమె ఒప్పుకున్నారు.. నేను వేసుకున్నాను. చీర కట్టుకుని స్విమ్ చేస్తానని చెప్పలేను కదా! ఎక్స్‌పోజింగ్ అనే కోణంలో ఆలోచించకుండా.. ఎక్కడ ఎలా ఉండాలో అలా ఉండాలి అనుకునేదాన్ని” అని కవిత పేర్కొన్నారు.

**సూపర్‌స్టార్ కృష్ణకు వీరాభిమాని**

ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న కవిత.. సూపర్‌స్టార్ కృష్ణపై తనకున్న అభిమానాన్ని ప్రత్యేకంగా వెల్లడించారు. చిన్నతనంలోనే కృష్ణను చూసినప్పుడు.. ఆయనలాంటి భర్త తనకు రావాలని కలలు కనేదాన్నని చెప్పారు. తాను కృష్ణకు వీరాభిమానినని ఆమె పేర్కొన్నారు.తన అభిమానాన్ని దర్శకురాలు విజయనిర్మల గుర్తించి, కృష్ణ సరసన హీరోయిన్‌గా నటించే అవకాశం కల్పించారని కవిత తెలిపారు. కృష్ణతో నటించేటప్పుడు తనకున్న అభిమానం, గౌరవం కారణంగా కొంత బిగుసుకుపోయేదాన్నని, ఇతర హీరోలతో నటించినంత స్వేచ్ఛగా ఉండలేకపోయేదాన్నని చెప్పారు.విజయనిర్మల తనను సరదాగా ‘కపిత’ అని పిలిచేవారని, దానికి కోతి లేదా అల్లరి అనే అర్థం వస్తుందని కవిత తెలిపారు. కృష్ణ మితభాషి అయినప్పటికీ గొప్ప మానవతావాది, అద్భుతమైన వ్యక్తి అని ఆమె కొనియాడారు. తాను కృష్ణకు పెద్ద అభిమానినని చెప్పినప్పుడు ఆయన కేవలం చిరునవ్వుతో ‘అవునా’ అన్నట్లుగా స్పందించేవారని గుర్తుచేసుకున్నారు.

**కెరీర్‌లో కొన్ని అసంతృప్తులు**

తన సినీ కెరీర్‌లో కొన్ని విషయాలు మాత్రం అసంతృప్తిగా మిగిలిపోయాయని కవిత తెలిపారు. ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో హీరోయిన్‌గా నటించలేకపోవడం, దర్శకరత్న దాసరి నారాయణరావు దర్శకత్వంలో ‘ప్రేమాభిషేకం’ చిత్రంలో మాత్రమే నటించడం తన కెరీర్‌లోని నిరాశల్లో ఒకటని ఆమె పేర్కొన్నారు.పేదరికం నుంచి ప్రారంభమైన కవిత జీవితం.. బాలనటిగా సినీ రంగ ప్రవేశం నుంచి కథానాయికగా, ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టుగా సాగిన సుదీర్ఘ ప్రయాణానికి నిదర్శనంగా నిలిచింది.

# సీనియర్లకు డార్లింగ్ లైన్ క్లియర్ చేసినట్లే!

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద పండుగ సీజన్ వచ్చిందంటే? బడా హీరోల సినిమాల విడుదల తేదీల పోటీ ఊపందుకుంటుంది. ముఖ్యంగా సంక్రాంతి బరిలో దిగేందుకు హీరోలంతా ఆసక్తి చూపిస్తారు. అయితే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తోన్న తాజా చిత్రం –ఫౌజీ– విడుదలపై ఫిలింనగర్ వర్గాల్లో ఆసక్తికర ప్రచారం సాగుతోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి రేసులో కాకుండా జనవరి 26న గణతంత్ర దినోత్సవ కానుకగా విడుదల చేయడానికి చిత్రబృందం సమాయత్తమవుతోందనే వార్త హాట్ టాపిక్‌గా మారింది. ఈ నిర్ణయంతో సీనియర్ హీరోలకు సంక్రాంతి లైన్ క్లియర్ అయినట్లేనని చెప్పొచ్చు. పరిశ్రమలో సీనియర్ నటులపట్ల గౌరవం, మర్యాదలు ప్రదర్శించడంలో ప్రభాస్ ఎప్పుడూ ముందుంటారు. అందుకే ఆయన్ని అంతా ఆప్యాయంగా డార్లింగ్ అని పిలుచుకుంటారు. గతంలో కూడా పలు సందర్భాల్లో సీనియర్ హీరోల సినిమాలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో తన చిత్రాల విడుదల తేదీలను సర్దుబాటు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. సీనియర్ల పట్ల తనకున్న అభిమానాన్ని మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపుతానని ప్రభాస్ మరోసారి నిరూపిస్తున్నారు. పోటీ వాతావరణాన్ని నివారించి అందరి సినిమాలకూ మంచి థియేటర్లు లభించాలనే ఆలోచనతో డార్లింగ్ తీసుకుంటున్న నిర్ణయం పరిశ్రమలో ప్రశంసలు అందుకుంటోంది. తెలుగు పరిశ్రమకు సంక్రాంతి అనేది అత్యంత లాభదాయకమైన సీజన్. ఈ సమయంలో చిరంజీవి, బాలకృష్ణ వంటి అగ్ర సీనియర్ హీరోల సినిమాలు విడుదల కావడం ఆనవాయితీగా వస్తోంది. ఇలాంటి సమయంలో ప్రభాస్ లాంటి భారీ పాన్ ఇండియా స్టార్ సినిమా సంక్రాంతి బరిలో ఉంటే థియేటర్ల కేటాయింపు, కలెక్షన్ల విభజన విషయంలో తీవ్ర పోటీ నెలకొంటుంది. –ఫౌజీ– వంటి భారీ ప్రాజెక్ట్ పండుగ రేసు నుంచి ఎగ్జిట్ అయి జనవరి 26కు షిఫ్ట్ అవ్వడం వల్ల సీనియర్ హీరోల సినిమాలకు కావాల్సినంత స్పేస్ లభించడమే కాకుండా వసూళ్ల పరంగా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇదే సీజన్ లో యంగ్ హీరోల సినిమాలు కూడా పరిమితంగా రిలీజ్ అవుతంఆయి. వారికి కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. సీనియర్ హీరోల సినిమాలకు టికెట్ దొరకని అభిమానులు చిన్న సినిమాలను ఆదరించే అవకాశం ఉంటుంది. కంటెంట్ బాగుంటే గనుక సీనియర్లను మంచిని విజయాలు చిన్న సినిమాలు సాధిస్తోన్న సంగతి తెలిసిందే.–ఫౌజీ– చిత్ర కథాంశం దేశభక్తి నేపథ్యంతో కూడుకున్నదనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు జనవరి 26 (రిపబ్లిక్ డే) వీకెండ్ సరైన వేదికగా నిలుస్తుందని చెప్పొచ్చు. పండుగ హడావుడి ముగిసిన వెంటనే సోలో రిలీజ్ అడ్వాంటేజ్ సాధించడానికి ఈ ప్లాన్ ఉపకరిస్తుంది. కథకు సరిపోయే సరైన తేదీని ఎంచుకోవడంతో పాటు పరిశ్రమ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవడం డార్లింగ్ వ్యక్తిత్వానికి నిదర్శనం.







PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com